## అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యమే ప్రభుత్వ లక్ష్యం



వివరాలు 3లో

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

**విలేకరులు కావలెను**


సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7569677170

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక : 248 సంపాదకులు: కలిచేటి వెంకయ్య సోమవారం 3 ఆగస్టు 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

## ఏపీకి కేంద్రం నుంచి రూ.4,597 కోట్ల అదనపు పన్నుల వాటా విడుదల



- నిధులు కేటాయించినందుకు ప్రధానికి, ఆర్థిక మంత్రికి సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు
- సాధారణ తేదీ కంటే ముందుగానే నిధులు విడుదల చేయడంపై హర్షం
- ఈ సాయంతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతాయని వెల్లడి
- కేంద్ర సహకారం రాష్ట్ర పురోగతికి ఎంతో దోహదపడుతుందని సీఎం పేర్కొన్నారు.

అమరావతి ( సింధూర దర్శిని) 2 ఆగస్టు: ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర ప్రభుత్వం అదనపు పన్నుల వాటాను విడుదల చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతా రామన్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సకాలంలో అందిన ఈ ఆర్థిక చేయూత మిగతా 2లో...

## రూ.57 లక్షల కోట్లు హాంఫట్... నెల రోజుల్లోనే భారీగా నష్టపోయిన ఎలాన్ మస్క్!


- నెల రోజుల్లోనే ఎలాన్ మస్క్ సంపద 600 బిలియన్ డాలర్లకు పైగా క్షీణత
- స్పేస్ఎక్స్, టెస్లా కంపెనీల షేర్ల పతనం ప్రధాన కారణంగా వెల్లడి
- రికార్డు స్థాయి నుంచి స్పేస్ఎక్స్ షేరు 46 శాతం పడిపోవడంతో భారీ నష్టం
- నష్టాలు ఉన్నప్పటికీ ఏఐ, రోబోటిక్స్‌పై భారీ పెట్టుబడులకు మస్క్ సిద్ధం



వివరాలు 2 లో

## వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం
### యువతకు ప్రధాని మోదీ పిలుపు

- వికసిత భారత్ సంకల్ప అభియాన్‌లో భాగంగా 'నశా ముక్త్ యువ' ప్రారంభం
- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ యువతకు ప్రధాని మోదీ పిలుపు
- 2047 నాటికి వికసిత భారత్ సాధనకు ఆరోగ్యవంతమైన యువత అవసరమని స్పష్టీకరణ
- దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం క్రీడలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ
- గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైనట్లు వెల్లడించిన ప్రధాని



ఢిల్లీ (సింధూర దర్శిని) 2 ఆగస్టు: దేశ యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి దూరంగా, శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే 'వికసిత భారత్' సంకల్పం నెరవేరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో నేటి తరం యువత చూపిస్తున్న నిబద్ధత, సామాజిక స్పృహ తన నమ్మకాన్ని మరింత బలపరిచాయని ఆయన ప్రశంసించారు. నేడు 'నశా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రధాని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా యువతను ఏకతాటిపైకి తెచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 'మై భారత్' వాలంటీర్ల నేతృత్వంలో ఇది ఒక ప్రజా భాగస్వామ్య (జన్ భాగీదారీ) ఉద్యమంగా రూపుదిద్దుకుంది. "మనం ఒక గొప్ప, ముఖ్యమైన సంకల్పం కోసం ఇక్కడ సమావేశమయ్యాం. ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యక్తి, కుటుంబం లేదా సమాజం కోసం కాదు. ఇది దేశం కోసం. వికసిత భారత్ దిశగా దేశం అడుగులు వేస్తున్నప్పుడు, యువత డ్రగ్స్ సమస్యకు దూరంగా ఉండటం అత్యవసరం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాశీతో ఈ కార్యక్రమానికి ఉన్న అనుబంధాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. "కాశీ ఎంపీగా, ఈ కార్యక్రమం గతేడాది పవిత్ర కాశీ క్షేత్రంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. దీనివల్ల ఈ కార్యక్రమానికి శాస్త్రీయ దృక్పథంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, సాధువుల ఆశీస్సులు, సాంస్కృతిక వారసత్వం మిగతా 2లో...

## ఏపీ అభివృద్ధిలో ఆస్ట్రేలియా భాగస్వామ్యం.. మంత్రి లోకేశ్ చొరవతో 4 ఎంఓయూలు

- ఏపీ, ఆస్ట్రేలియా మధ్య 4 కీలక ఒప్పందాలు
- ఐఐటీ తిరుపతిలో సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు
- విద్యార్థుల మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన ఫలితంగా కుదిరిన ఎంవోయూలు
- లోకేష్, ఆస్ట్రేలియా మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో సంతకాలు



అమరావతి ( సింధూర దర్శిని) 2 ఆగస్టు: ఆంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య బంధం మరింత బలపడింది. క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో సహకారాన్ని పెంచుకుంటూ ఇరుపక్షాలు నాలుగు వ్యూహాత్మక ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకున్నాయి. ఉండవల్లిలో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, అభివృద్ధి సహాయ మంత్రి జూలియన్ హిల్ హాజరయ్యారు. ఇటీవల మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ పర్యటన సందర్భంగా అక్కడి సంస్థలతో జరిపిన చర్చలు, ఏపీలో పెట్టుబడులకు ఇచ్చిన ఆహ్వానం ఫలితంగానే ఈ ఒప్పందాలు సాకారమయ్యాయి.

**ఐఐటీ తిరుపతిలో సోలార్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్**

మొదటి ఒప్పందం ప్రకారం, విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (CoEET), ఐఐటీ తిరుపతి, ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (UNSW) కలిసి ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో 'సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయనున్నాయి. దీని ద్వారా ఏపీని సోలార్ తయారీ, పరిశోధన, ఆవిష్కరణలకు జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడం లక్ష్యం. ఈ సెంటర్‌లో అధునాతన సోలార్ పీవీ తయారీ, ప్యానెళ్ల రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ వంటి అంశాలపై పరిశోధనలు జరుగుతాయి. సోలార్ సెల్ ఫిజిక్స్, మిగతా 2లో...

## లష్కర్ బోనాల్లో సీఎం రేవంత్ రెడ్డి.. మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు

- సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్
- ప్రభుత్వం తరఫున జగన్మాతకు పట్టువస్త్రాలు, బోనం సమర్పణ
- ముఖ్యమంత్రితో పాటు పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క
- అంగరంగ వైభవంగా జరుగుతున్న లష్కర్ బోనాల జాతర



వివరాలు 2 లో



## ఏపీలో తక్కువ ధరకే బియ్యం.. అమ్మకాలు ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

- సామాన్యులకు ఊరటనిస్తూ ప్రభుత్వ బియ్యం అమ్మకాలు
- విజయవాడలో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్
- రైతు బజార్లు, మిల్లుల్లో కేజీ రూ. 50, రూ. 52కే బియ్యం

వివరాలు 2 లో

## ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?: జగన్

- రాష్ట్రంలో అరాచక పాలన పరాకాష్టకు చేరిందని జగన్ విమర్శ
- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిని ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారని ఆగ్రహం
- సీదిరి అప్పలరాజు, ముస్తఫాలపై అక్రమ కేసులు బనాయించారని ధ్వజం
- ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చడానికే దాడులు, అరెస్టులని విమర్శ
- ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేసిన జగన్



అమరావతి ( సింధూర దర్శిని) 2 ఆగస్టు: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, 'నారాసుర పాలన'లో అరాచకం పరాకాష్ఠకు చేరిందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దాడి చేసిన అధికార పార్టీ వారికి రక్షణ కల్పిస్తూ, బాధితులైన ప్రతిపక్ష నేతలపైనే హత్యాయత్నం వంటి మిగతా 2లో...

## ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?: జగన్

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రమైన కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యమా, పోలీస్ రాజ్యమా లేక జంగిల్ రాజ్యమా అని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు.ఆలూరు బీసీ ఎమ్మెల్యే విరూపాక్షిని అర్ధరాత్రి అరెస్ట్ చేసిన తీరుపై జగన్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. "ప్రజలెన్నుకున్న ఎమ్మెల్యే విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా? అర్ధరాత్రి 2:45 గంటలకు వందలాది పోలీసులతో ఇంటిపై దాడి చేసి, తలుపులు బద్దలుకొట్టి అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చింది?" అని జగన్ నిలదీశారు. చిప్పగిరి మండలం నేమకల్లులో టీడీపీ శ్రేణులు తమ పార్టీ నాయకుడి ఇంటిపై దాడి చేయగా, ప్రాణభయంతో ఆ కార్యకర్త ఎమ్మెల్యేకు ఫోన్ చేశాడని జగన్ వివరించారు. బాధితుడికి అండగా నిలబడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపైనే టీడీపీ వారు రాళ్లతో దాడి చేశారని, ఈ ఘటనలో ఆయన సోదరుడు గాయపడ్డాడని తెలిపారు. వాస్తవానికి దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాల్సింది పోయి, బాధితుడైన ఎమ్మెల్యేపైనే హత్యాయత్నం కేసు నమోదు చేయడం దారుణమని అన్నారు. అర్ధరాత్రి పోలీసులు జరిపిన దౌర్జన్యం బయటకు రాకూడదనే భయంతోనే ఎమ్మెల్యే ఇంట్లోని సీసీటీవీ హార్డ్‌డిస్క్‌లను తీసుకెళ్లారని, సాక్ష్యాలను కాపాడాల్సిన పోలీసులతోనే సాక్ష్యాలను మాయం చేయిస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు.ఇదే తరహా రాజకీయ కక్ష సాధింపు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతోందని జగన్ విమర్శించారు. శ్రీకాకుళం జిల్లాలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదాన్ని హత్య కేసుగా మార్చి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే షేక్ మహ్మద్ ముస్తఫా, ఆయన కుమారుడిపై కూడా వ్యాపార వివాదాన్ని అడ్డుపెట్టుకుని కిడ్నాప్ కేసు బనాయించారని, పోలీసులకు అప్పగించిన వ్యక్తిని కిడ్నాప్ చేశారని కేసు పెట్టడం ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ అక్రమ అరెస్టులు, దాడులకు పాల్పడుతున్నారని జగన్ అన్నారు. డీఎస్సీ-2025 అక్రమాలపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఎందుకు రాజీనామా చేయడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.9,500 కోట్ల విద్యా, వసతి దీవెన బకాయిలు, నిరుద్యోగులకు ఇస్తామన్న రూ.3 వేల భృతి హామీ ఏమైందని నిలదీశారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడుతోందన్నారు. "అధికారం, పోలీసు బలం శాశ్వతం కాదు. ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని అర్ధరాత్రి అరెస్టులు చేసినా వైసీపీ వెనక్కి తగ్గదు. బాధితులకు అండగా నిలుస్తూ అరాచక పాలనపై పోరాటం కొనసాగిస్తాం" అని జగన్ స్పష్టం చేశారు.

## ఏపీకి కేంద్రం నుంచి రూ.4,597 కోట్ల అదనపు పన్నుల వాటా విడుదల

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత బలాన్ని ఇస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన కేంద్రం నుంచి రాష్ట్రాలకు పన్నుల వాటా విడుదల అవుతుంది. అయితే, ఈసారి గడువుకు ముందే ఏపీకి అదనంగా రూ.4,597 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ కేటాయింపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా స్పందించారు. "అదనపు పన్నుల వాటాను కేటాయించినందుకు ప్రధాని మోదీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర ప్రజల తరఫున ధన్యవాదాలు. కేంద్రం విడుదల చేసిన ఈ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత వేగవంతం అవుతుంది" అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అందిస్తున్న సహకారం ఎంతో కీలకమని చంద్రబాబు అన్నారు. ఈ సహకారం రాష్ట్ర పురోగతికి గొప్పగా దోహదపడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్రం నుంచి అందిన ఈ అదనపు నిధులు, రాష్ట్రంలో చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి పనులకు ఊతమిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం యువతకు ప్రధాని మోదీ పిలుపు

(మొదటిపేజీ తరువాయి)

కూడా తోడయ్యాయి" అని ఆయన అన్నారు. 2025 జులైలో వారణాసిలో జరిగిన యూత్ స్పిరిచ్యువల్ సమ్మిట్‌లో దేశంలోని 125 ఆధ్యాత్మిక సంస్థలు ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌తో 'కాశీ డిక్లరేషన్'ను ఆమోదించాయని, వారంతా లక్షలాది పౌరులకు సేవ చేస్తున్నారని మోదీ వివరించారు. యువతను దేశానికి 'అమృత తరం' (అమృత్ పీఢి)గా అభివర్ణించిన ప్రధాని.. "రాబోయే 20-25 ఏళ్లలో మీ జీవితాలకు మీరే దిశానిర్దేశం చేసుకుంటారు. 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేసేది మీరే. ఆ విజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదించేది కూడా మీరే. దేశానికి మీ శక్తి, సృజనాత్మకత, ప్రతిభ ఎంతో అవసరం. కాబట్టి దేశం కోసం, మీ సొంత జీవితాల కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండండి" అని పిలుపునిచ్చారు.ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు, ధ్యాన శిబిరాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే యువతే వికసిత భారత్‌కు అసలైన బలం' అనే సందేశాన్ని దేశంలోని ప్రతి యువకుడికి చేర్చడమే ఈ ఉద్యమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# ఏపీలో తక్కువ ధరకే బియ్యం.. అమ్మకాలు ప్రారంభించిన మంత్రి నాదెండ్ల





అమరావతి ( సింధూర దర్శిని) 2 ఆగస్టు: రాష్ట్రంలోని సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పిస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించేందుకు, తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 130 రైతు బజార్లు, 500 రైస్ మిల్లుల వద్ద ప్రత్యేక కౌంటర్ల ద్వారా సబ్సిడీ బియ్యం విక్రయాలను ఆదివారం ప్రారంభించింది. విజయవాడలోని ఏపీఐఐసీ రైతు బజార్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి, ప్రజలకు స్వయంగా బియ్యాన్ని అందజేశారు.ఈ పథకం కింద బీపీటీ సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ. 52కు, బీపీటీ రా రైస్‌ను కిలో రూ. 50కే విక్రయిస్తున్నారు. ఆధార్ కార్డు చూపించి ఒక వ్యక్తి 10 కిలోల వరకు బియ్యం కొనుగోలు చేయవచ్చు. బహిరంగ మార్కెట్‌లో రూ. 60 నుంచి రూ. 65 వరకు పలుకుతున్న ఈ రకం బియ్యాన్ని ప్రభుత్వం తక్కువ ధరకే అందుబాటులోకి తేవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి.ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. "ప్రజలకు కష్టం రాకముందే వారిని ఆదుకునే ప్రభుత్వం మాది. మార్కెట్‌లో బియ్యం ధరలను సమీక్షించి, సామాన్యుడిపై భారం పడకుండా తక్కువ ధరకే బియ్యం అందించాలని నిర్ణయించాం. మా విజ్ఞప్తికి రైస్ మిల్లర్లు సానుకూలంగా స్పందించి సహకరించడం అభినందనీయం" అని తెలిపారు. భవిష్యత్తులో కందిపప్పు, పామాయిల్‌ను కూడా తక్కువ ధరలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన రావు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ నూపుర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జనసేన నేత అమ్మిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

# లష్కర్ బోనాల్లో సీఎం రేవంత్ రెడ్డి.. మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు





హైదరాబాద్ (సింధూర దర్శిని) 2 ఆగస్టు: సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆయన జగన్మాతకు బోనం, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.లష్కర్ బోనాల జాతరలో భాగంగా ఆలయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భగుడిలో మహంకాళి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీఆర్ఎస్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా పాల్గొన్నారు. వారు కూడా అమ్మవారికి పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆలయ పరిసరాల్లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# రూ.57 లక్షల కోట్లు హాంఫట్... నెల రోజుల్లోనే భారీగా నష్టపోయిన ఎలాన్ మస్క్!

**టెస్లా:** ప్రపంచ కుబేరుడు, టెస్లా, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ సంపద కేవలం నెల రోజుల వ్యవధిలోనే భారీగా పడిపోయింది. ఆయన నికర విలువలో సుమారు 600 బిలియన్ డాలర్లకు (రూ.57 లక్షల కోట్లు) పైగా కోత పడింది. స్పేస్‌ఎక్స్, టెస్లా కంపెనీల షేర్లు మార్కెట్లో తీవ్ర ఒత్తిడికి గురవడమే ఈ నష్టానికి ప్రధాన కారణంగా నిలుస్తోంది. అయినప్పటికీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అటానమస్ డ్రైవింగ్, రోబోటిక్స్ వంటి భవిష్యత్ టెక్నాలజీలపై తన పెట్టుబడుల ప్రణాళికలో మాత్రం మస్క్ వెనక్కి తగ్గడం లేదు.వివరాల్లోకి వెళ్తే, జూన్ 16న మస్క్ నికర విలువ సుమారు 1.33 ట్రిలియన్ డాలర్ల రికార్డు స్థాయికి చేరుకుంది. ఆ సమయంలో స్పేస్‌ఎక్స్ షేర్ల దూకుడుతో ఆయన ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా చరిత్ర సృష్టించారు. అయితే, నెల రోజులు గడిచేసరికి ఆయన సంపద 684 బిలియన్ డాలర్లకు పడిపోయింది. కేవలం మస్క్ సంపదలో వచ్చిన ఈ తగ్గుదల, ప్రపంచంలోని ఇతర బిలియనీర్ల మొత్తం సంపద కంటే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ నష్టానికి స్పేస్‌ఎక్స్ షేర్ల పతనమే కీలక కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా 75 బిలియన్ డాలర్లను సమీకరించిన స్పేస్‌ఎక్స్, 135 డాలర్ల ఐపీఓ ధరకు బదులుగా 150 డాలర్ల వద్ద లిస్ట్ అయింది. ఆరంభంలో ఇన్వెస్టర్ల ఉత్సాహంతో మూడు ట్రేడింగ్ సెషన్లలోనే షేరు విలువ 50 శాతానికి పైగా పెరిగి, జూన్ 16న 202 డాలర్ల రికార్డు స్థాయికి చేరింది. కానీ ఈ జోరు ఎక్కువ కాలం నిలవలేదు. అప్పటి నుంచి షేరు విలువ సుమారు 46 శాతం పతనమై 108.37 డాలర్ల కనిష్ట స్థాయికి పడిపోయింది. దీంతో మస్క్ సంపదలో వందల బిలియన్ డాలర్లు ఆవిరయ్యాయి.మరోవైపు, టెస్లా షేర్ల బలహీనత కూడా మస్క్ సంపదపై మరింత ఒత్తిడి పెంచింది. జూలై 22న రెండో త్రైమాసిక ఫలితాలను ప్రకటించిన తర్వాత కంపెనీ షేర్లు 17 శాతం మేర పడిపోయాయి. రెండేళ్లలో తొలిసారిగా టెస్లా లాభాల అంచనాలను అందుకోలేకపోయింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్‌పై ఖర్చులను పెంచడం వల్ల కంపెనీ నగదు నిల్వలు కూడా ప్రతికూలంగా మారాయి. వాహన డెలివరీలు పెరిగినప్పటికీ, ఏఐ పెట్టుబడుల వల్ల నిర్వహణ ఖర్చులు పెరగడం, కార్ల సగటు అమ్మకం ధరలు తగ్గడం వంటివి లాభాలపై ప్రభావం చూపాయని కంపెనీ వివరించింది. అయితే, స్వల్పకాలికంగా ఆర్థిక ఒత్తిళ్లు ఎదురైనా, మస్క్ మాత్రం తన దూకుడు పెట్టుబడుల వ్యూహాన్ని మార్చుకోవడం లేదు. ఏఐ ఆధారిత సెల్ఫ్ డ్రైవింగ్ టెక్నాలజీ, రోబోట్యాక్సీలు, హ్యూమనాయిడ్ రోబోల సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ ఏడాది 25 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేయాలని టెస్లా యోచిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇది గతేడాది పెట్టిన పెట్టుబడులతో పోలిస్తే దాదాపు మూడు రెట్లు అధికం.

# ఏపీ అభివృద్ధిలో ఆస్ట్రేలియా భాగస్వామ్యం.. మంత్రి లోకేశ చొరవతో 4 ఎంఓయూలు

(మొదటిపేజీ తరువాయి)

మాన్యుఫ్యాక్చరింగ్, వాఫరింగ్ టెక్నాలజీస్ వంటి అంశాలపై కరిక్యులమ్, శిక్షణా కార్యక్రమాలను UNSW రూపొందించి సహకారం అందిస్తుంది.

### సమ్మిళిత విద్య బలోపేతం కోసం

రెండో ఒప్పందం సమ్మిళిత విద్యపై దృష్టి సారించింది. యూఎన్‌ఎస్‌డబ్ల్యూ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఏపీ సమగ్ర శిక్ష సంయుక్తంగా ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఆటిజం, ఇతర న్యూరోడైవర్స్ విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచడం దీని ముఖ్య ఉద్దేశం. స్పెషల్ ఎడ్యుకేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు, రాష్ట్ర విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా బోధనా వనరులను రూపొందిస్తారు.

### విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై పైలట్ ప్రాజెక్ట్

మూడో ఒప్పందంలో భాగంగా ఏపీ ఉన్నత విద్యా మండలి, ఆస్ట్రేలియాకు చెందిన రీబౌండ్ డింపుల్ ప్రైవేట్ లిమిటెడ్ కలిసి రాష్ట్రంలోని ఎంపిక చేసిన విద్యాసంస్థల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టనున్నాయి. విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణే దీని లక్ష్యం. ప్రత్యేకంగా రూపొందించిన వేదిక ద్వారా విద్యార్థులు తమ గోప్యతకు భంగం కలగకుండా మానసిక ఆరోగ్య సలహాలు, వర్చువల్ కౌన్సెలింగ్ సేవలను పొందవచ్చు. ఈ పైలట్ ప్రాజెక్టును ఉచితంగా అమలు చేయనున్నారు.

### నైపుణ్యాభివృద్ధికి డీఎల్ఎస్‌తో భాగస్వామ్యం

నాలుగో ఒప్పందం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ (APSS-DC), ఆస్ట్రేలియాకు చెందిన డైనమిక్ లెర్నింగ్ సర్వీసెస్ (DLS) మధ్య కుదిరింది. వృత్తి విద్య, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం కోసం ఇరు సంస్థలు కలిసి పనిచేస్తాయి. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా శిక్షణా కార్యక్రమాలను రూపొందించి, ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ అందించడం దీని ప్రధాన లక్ష్యం.ఈ ఒప్పందాలకు ముందు ఆస్ట్రేలియా ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయింది. ఏపీలో ఉన్న అవకాశాలను సీఎం వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ డా.సత్యనారాయణ్, చెన్నైలోని ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలై జాకీ సహా పలువురు ఉన్నతాధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# బోనాలను గతంలో పట్టించుకోలేదు.. కేసీఆర్ వల్లే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా: కేటీఆర్

- సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్
- గత ప్రభుత్వాలు బోనాలను గుర్తించలేదని విమర్శ
- కేసీఆర్ పాలనలోనే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా వచ్చిందన్న మాజీ మంత్రి



హైదరాబాద్ (సింధూర దర్శిని) 2 ఆగస్టు: నేడు సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కేటీఆర్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, బోనాలు కులాలకు అతీతంగా జరుపుకునే గొప్ప పండుగ అని కొనియాడారు. సమైక్య రాష్ట్రంలో బోనాల పండుగను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, రాష్ట్ర పండుగగా గుర్తించలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తుచేశారు. అమ్మవారి ఆశీస్సులతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని కేసీఆర్ ఎప్పుడూ చెబుతుంటారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గుడికి రూ.25 కోట్లు కేటాయించి, పండుగలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో పచ్చగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు కేటీఆర్ చెప్పారు. రైతులందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యమే ప్రభుత్వ లక్ష్యం

### పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ



నెల్లూరు( సింధూర దర్శిని) 2 ఆగస్టు నెల్లూరు జిల్లా ; నగర ప్రజలను అభివృద్ధి పనుల్లో భాగస్వాములను చేయడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. నెల్లూరు నగరం 4వ డివిజన్, శ్రీనివాస నగర్ 3వ వీధిలో శ్రీనివాస నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం. శ్రీనివాసులు రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మంత్రి, నగర కార్పొరేషన్ పరిధిలోని 42 రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల పరిధిలోకి ప్రతి నెలా ఒక ప్రత్యేక రోజున శానిటేషన్, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ విభాగాల అధికారుల బృందం నేరుగా వచ్చి స్థానిక సమస్యలను పరిశీలిస్తుందని ప్రకటించడమే కాకుండా, శ్రీనివాస నగర్ పరిధిలోని డ్రైనేజీ పునర్నిర్మాణం.. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. .అసోసియేషన్ సెక్రటరీ ఎం. రాజగోపాల్ రెడ్డి, కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావు, ఎస్. రమణారెడ్డి, కే. కేశవరెడ్డి, మాధవరావు తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమం స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో కమిషన్ నందన్,మేయర్ సుజాత,డిప్యూటి మేయర్ రూప్ కుమార్ యాదవ్,నగర అధ్యక్షుడు మామిడాల మధు, 4వ డివిజన్ అధ్యక్షులు నారాయణ రెడ్డి,రంగనాథస్వామి ఆలయ చైర్మన్ లెక్కల వెంకారెడ్డిలతో పాటు మునగాల శ్రీనివాసులు రెడ్డి, హబీబ్ మరియు వావిళ్ల బాబు, టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు మీకోసం-ప్రజా సమస్యల పరిష్కార వేదిక

### జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల



నెల్లూరు (సింధూర దర్శిని) 2 ఆగస్టు నెల్లూరు జిల్లా ; ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను ఈ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్జీదారులు తమ అర్జీలను అధికారిక వెబ్‌సైట్ వీవవనిశీయిఎ.ఖజా.స్త్రశీజ.ఱఅ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీ స్థితి లేదా ఇతర వివరాలకు సంబంధించిన సమాచారం కోసం నేరుగా 1100 కాల్ సెంటర్ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం "సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్" ను అందుబాటులోకి తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజలు చేసిన ఫిర్యాదుల పరిష్కారంపై వారి అభిప్రాయాలను నేరుగా సేకరించి, పరిష్కార నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలు, పౌర సేవా కేంద్రాల్లో ప్రదర్శించిన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ను ఫిర్యాదుదారులు స్కాన్ చేసి తమ సమస్య పరిష్కారంపై ఫీడ్‌బ్యాక్ నమోదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటిలో సహాయకులతో కూడిన అర్జీ స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణతో పాటు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ప్రదర్శనకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేయడమైనది. అర్జీదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందడంతో పాటు, సమస్య పరిష్కారమైన అనంతరం సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను నమోదు చేసి ప్రజా సేవల నాణ్యతను మరింత మెరుగుపరచేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# బళ్లారి రాఘవ సేవలు చిరస్మరణీయం

### జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్



నెల్లూరు( సింధూర దర్శిని) 2 ఆగస్టు నెల్లూరు జిల్లా ; తెలుగు నాటక, చలన చిత్ర రంగ కళాకారుడు బళ్లారి రాఘవ సేవలు చిరస్మరణీయమని జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్ అన్నారు. ఆయన ఆశయాలు, కళా ప్రస్థానం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ హాలులో ఆదివారం నిర్వహించిన బళ్లారి రాఘవ జయంతి వేడుకల్లో డీఆర్వో విజయ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొని, ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ, బళ్లారి రాఘవ తెలుగు నాటక రంగానికి విశిష్ట సేవలందించి తనదైన ముద్ర వేశారని కొనియాడారు. కళను సామాజిక చైతన్యానికి వేదికగా మలిచిన మహనీయుడిగా ఆయనను స్మరించుకున్నారు. బళ్లారి రాఘవ ఆదర్శాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెట్నల్ సీఈఓ నాగేశ్వరరావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి అస్గర్ అలీ, సెట్నల్ మేనేజర్ శ్రీనివాసరావు, కలెక్టరేట్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని బళ్లారి రాఘవ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు.

# పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి



నెల్లూరు ( సింధూర దర్శిని) 2 ఆగస్టు నెల్లూరు జిల్లా ; జిల్లాలో పేకాట, గ్యాంబ్లింగ్ తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా ఎస్పీ డా. అజితా వేజెండ్ల ఆదేశాల మేరకు ఆదివారం అనంతసాగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గౌరవరం గ్రామంలో పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 4 గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2,040/- నగదు మరియు 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల పై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లాలో నేరాల నియంత్రణలో భాగంగా పేకాట, మట్కా, గ్యాంబ్లింగ్, కోడిపందేలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తూ, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసులు మాట్లాడుతూ, జిల్లాలో చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇటువంటి కార్యకలాపాలపై సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే దయల్-112 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 93929 03413కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడిలో అనంతసాగరం సబ్ ఇన్స్పెక్టర్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## డీఎస్సీ ఫలితాల అవకతవకలపై సమావేశం

### గూడూరు వైసిపి నూతన సమన్వయకర్త బూదూరు గురవయ్య

గూడూరు( సింధూర దర్శిని) 2 ఆగస్టు నెల్లూరు జిల్లా ; డీఎస్సీ ఫలితాల అవకతవకలపై వైసిపి పార్టీ ఆధ్వర్యంలో 3 వ తేదీ సోమవారం ఉదయం గూడూరు పట్టణంలోని పివిఆర్ కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహిస్తున్నామని ఈ సమావేశానికి విద్యార్థినీ విద్యార్థులు యువకులు పాల్గొని విజయవంతం చేయాలని, గూడూరు నియోజకవర్గ వైసిపి పార్టీ నూతన ఇంచార్జ్ బూదురు గురవయ్య కోరారు. గూడూరు పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జరిగిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి బుదురు గురవయ్య మాట్లాడుతూ డీఎస్సీ అవకతలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడం పై సోమవారం గూడూరు పివిఆర్ కళ్యాణమండపంలో సమావేశం నిర్వహిస్తున్నామని ముందుగా సాదుపేట సెంటర్ నుండి బైక్ ర్యాలీ జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మాజీమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి , ఎమ్మెల్సీలు చంద్రశేఖర్ రెడ్డి, మేరిగా మురళీధర్,నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈనెల ఆరో తేదీ నుండి 9వ తేదీ వరకు రిలే దీక్షలు జరుగుతాయని విద్యార్థిని విద్యార్థులు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అట్టల శ్రీనివాసులు రెడ్డి , మనుబోలు కృష్ణయ్య , మహేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాం ట్రస్ట్‌లో స్నేహితుల దినోత్సవ వేడుకలు



గూడూరు( సింధూర దర్శిని) 2 ఆగస్టు నెల్లూరు జిల్లా ; స్నేహితుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్ట్ సభ్యులతో పాటు వాలంటీర్లతో , అబ్దుల్ కలాం అభిమానులతో స్నేహితుల దినోత్సవ వేడుకలను జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు "డా" సయ్యద్ తాజుద్దీన్ మాట్లాడుతూ స్నేహమన్నది కులమత బేధం, కల్మషం లేని ఒక నిజమైన బంధం ఆ బంధానికి ప్రతిరూపం నమ్మకం అటువంటి బంధానికి ప్రతి ఒక్కరు హృదయపూర్వకంగా నమ్మకంతో స్నేహితులతో ముందుకు అడుగు వేయాలని మనసారా కోరుకుంటూ నా స్నేహితులకు నా శ్రేయోభిలాషులకు ట్రస్ట్ మెంబర్లకు వాల్టర్లకు హృదయపూర్వక స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని ఆయన అన్నారు.

## రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం

### వీరారెడ్డిపల్లి ప్రాంతంలో ఐదు రోజులుగా కొనసాగుతున్న టిడిపి ఇంటింటికి ప్రచారం



గూడూరు (సింధూర దర్శిని) 2 ఆగస్టు నెల్లూరు జిల్లా ; తెలుగుదేశం పార్టీ నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం తలపెట్టిన ఇంటింటి ప్రచారం కార్యక్రమం గూడూరు ఎమ్మెల్యే మరియు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశిం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు మాజీ కౌన్సిలర్ మరియు 15వ యూనిట్ ఇంచార్జ్ తాతపూడి ఇశ్రాయేల్ కుమార్ సూచనల ప్రకారం గత 5 రోజులు గా గూడూరు పట్టణం లోని 28 వ వార్డు లోని ఎగువ, దిగువ వీరారెడ్డి పల్లి నందు ఇంటింటికి కరపత్రాలు పంచుతూ కూటమి ప్రభుత్వం గత రెండు సంవత్సరాలలో అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గూర్చి ప్రచారం చేస్తూ ప్రజలకు వివరించడం జరిగింది. ఈ ప్రచార కార్యక్రమం లో స్థానిక సమస్యలు తెలుసుకుంటూ వాటిని ఎమ్మెల్యే దృష్టికి, సంబంధిత అధికారుల దృష్టి కి తీసుకెళ్లుతూ పరిష్కరించడం జరుగుతుంది. ఈ ప్రచార కార్యక్రమం లో 10 వ బూత్ కో కన్వీనర్ గంగలపూడి శ్రీనివాసులు, 28 వార్డు వైస్ ప్రెసిడెంట్ కోవూరు మురళి, వార్డ్ కమిటీ సభ్యుడు పరిమళ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో రుతుపవనాల వింత పోకడ.. ఒకచోట కుండపోత, మరోచోట ఉక్కపోత!

**ఢిల్లీ:** దేశంలో నైరుతి రుతుపవనాలు విస్తరించినప్పటికీ, వాటి గమనం అసమానంగా, బలహీనంగా కొనసాగుతోంది. ఒకవైపు కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా, మరోవైపు అనేక ప్రాంతాలు వర్షాల కోసం దురుచూస్తున్నాయి. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో వేడిమితో ఉక్కపోత పరిస్థితులు నెలకొన్నాయి. జాతీయ స్థాయిలో ఇప్పటివరకు 11 శాతం వర్షపాత లోటు నమోదైంది. ఈ పరిస్థితిని భారత వాతావరణ శాఖ (ఐఎండీ), ఇస్రో సంయుక్తంగా పంపిన ఇన్శాట్-3డీఎస్ ఉపగ్రహ చిత్రాలు స్పష్టంగా కళ్లకు కడుతున్నాయి. వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, జూన్ 4 నుంచి ఇప్పటివరకు దేశంలో 446.3 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి బదులుగా కేవలం 395.5 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదైంది. ఉపగ్రహ చిత్రాల్లో పశ్చిమ, మధ్య భారతదేశంపై దట్టమైన మేఘాలు ఆవరించి ఉండగా, గంగా-సింధు మైదాన ప్రాంతాలైన ఢిల్లీ, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లోని చాలా ప్రాంతాల్లో ఆకాశం నిర్మలంగా కనిపిస్తోంది. ప్రస్తుతం గుజరాత్, దాని పరిసర ప్రాంతాల్లో క్రియాశీలంగా ఉన్న వాతావరణ వ్యవస్థ కారణంగా అక్కడ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.




## సత్ప్రవర్తనతో జీవించండి నేర ప్రవృత్తికి స్వస్తి పలకండి

నెల్లూరు( సింధూర దర్శిని) 2 ఆగస్టు నెల్లూరు జిల్లా ; జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు సత్ప్రవర్తనతో జీవించేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల సూచనలు మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, కేడి లు , డి సి లు మరియు ఇతర నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు పోలీసు అధికారులు ప్రత్యేక సత్ ప్రవర్తనా కౌన్సిలింగ్లు నిర్వహించారు.కౌన్సిలింగ్ సందర్భంగా నేరాలకు దూరంగా ఉండి సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా ప్రజా శాంతికి భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు అని తెలిపారు.రౌడీయిజం, దౌర్జన్యాలు, బెదిరింపులు, గొడవలు, ఇతర శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. ప్రజా శాంతికి భంగం కలిగించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.జిల్లాను ప్రశాంత జిల్లాగా ఉంచడం, ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

## రాజకీయాల్లోకి 'కాక్రోచ్ జనతా పార్టీ'? ఆగస్టు 5న కీలక నిర్ణయం



**ముంబాయి:** ఆన్‌లైన్ వేదికగా యువతను సమీకరించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఇప్పుడు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రాజకీయాల్లోకి ప్రవేశించాలా, లేక ఉద్యమ సంస్థగానే కొనసాగాలా అనే అంశంపై ఆగస్టు 5న తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకుడు, జెన్-జీ ఐకాన్‌గా గుర్తింపు పొందిన అభిజీత్ దీప్కే తన నివాసంలో కోర్ కమిటీ సభ్యులతో సమావేశం కానున్నారని విశ్వసనీయ వర్గాలు ఆదివారం తెలిపాయి.వివిధ రాష్ట్రాల్లోని మద్దతుదారుల నుంచి సేకరించిన అభిప్రా యాల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయనున్నారు. సమావేశం ముగిసిన తర్వాత అభిజీత్ దీప్కే మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తారని పార్టీకి చెందిన ఒక ప్రతినిధి తెలిపారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిర్వహించిన నిరసన విజయవంతం కావడం, దాని ఫలితంగా అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఈ ఉద్యమ సంస్థపై అంచనాలు భారీగా పెరిగాయి.అయితే, విద్యార్థులు, యువత సమస్యలపై స్పందించే 'రెస్పాన్స్ గ్రూప్'గానే సీజేపీని కొనసాగిస్తామని అభిజీత్ గతంలోనే స్పష్టం చేశారు. శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతులకే కట్టుబడి ఉంటామని, ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా మారబోమని, ఏ పార్టీలోనూ విలీనం కాబోమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 5న జరిగే సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలను నిలబెట్టుకోవడం, విద్యా రంగంలో మార్పులకు చోదకశక్తిగా కొనసాగడం సీజేపీ ముందున్న అసలైన సవాలు అని విశ్లేషకులు భావిస్తున్నారు. సీజేపీ ఉద్యమం వెనుక బాహ్య శక్తుల పాత్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసంతృప్తి లేనిచోట ఇలాంటి ఉద్యమాలు పుట్టవని, కేవలం ఉన్న సమస్యలను విస్తృతం చేయగలవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సీజేపీ వేగంగా విస్తరించిన తీరు, సోషల్ మీడియాలో వారి ప్రచారం, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం వంటివి... గత రెండు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న నిరసన ఉద్యమాల నమూనాను ప్రతిబింబిస్తున్నాయని పరిశీలకులు పేర్కొంటున్నారు.

## హైడ్రాకు వెల్లువెత్తిన ప్రజా మద్దతు.. కొనసాగించాలంటూ హైదరాబాదులో ర్యాలీలు




హైదరాబాద్ (సింధూర దర్శిని) 2 ఆగస్టు: హైదరాబాద్ నగరంలో వరద నివారణ, చెరువుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా'కు ప్రజా మద్దతు వెల్లువెత్తింది. ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా, హైడ్రా పనితీరును ప్రశంసిస్తూ నగరంలోని పలు కాలనీల సంక్షేమ సంఘాలు ఆదివారం భారీ ర్యాలీలు నిర్వహించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేస్తూ, హైడ్రా కమిషనర్‌కు సంఘీభావం ప్రకటించాయి.అమీర్‌పేట, మధురానగర్, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల్లో శ్రీనివాస నగర్ వెస్ట్, వెంగల్ రావు నగర్, మధుర నగర్ సహా పదుల సంఖ్యలో కాలనీ సంక్షేమ సంఘాలు ఈ ర్యాలీలలో పాల్గొన్నాయి. హైడ్రాపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ, ప్రభుత్వానికి తమ మద్దతును వీడియోల రూపంలో పంపించాయి.

# వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్.. కోర్టులో హాజరు

- ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షిని అరెస్ట్ చేసిన పోలీసులు
- టీడీపీ కార్యకర్త ఇంటిపై దాడి చేశారన్న ఆరోపణలు
- ఎమ్మెల్యేతో పాటు మరో 14 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు
- ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట నిందితుల హాజరు
- అక్రమ అరెస్ట్ అంటూ వైసీపీ ఆరోపణ.. ఖండించిన ప్రభుత్వం



కర్నూలు (సింధూర దర్శిని) 2 ఆగస్టు కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. టీడీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై అధికార వైసీపీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే బి. విరూపాక్షిని, ఆయన కుమారుడు చంద్రశేఖర్‌ను పోలీసులు శనివారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు మరో 13 మందిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారందరినీ ఆదివారం ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట హాజరుపరిచారు.

### అసలేం జరిగింది?

చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో శనివారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాడులు, దౌర్జన్యాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. టీడీపీ కార్యకర్త శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే విరూపాక్షితో సహా మొత్తం 15 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### పోలీసుల కథనం ప్రకారం..

వైసీపీ నేత గిరి, టీడీపీ నేతలైన గురునాథ్, శివ, నాగరాజు మధ్య మొదలైన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. గిరి ఫోన్ చేయడంతో ఎమ్మెల్యే విరూపాక్షి సుమారు 10 కార్ల కాన్వాయ్‌తో గ్రామానికి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలోనే ఆయన అనుచరులు టీడీపీ నేత నాగరాజు ఇంట్లోకి చొరబడి దాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన మహిళ సుచిత్రపై కూడా చేయి చేసుకున్నారని, మరో నేత కొండా పురుషోత్తం కారును ధ్వంసం చేశారని పోలీసులు తెలిపారు. దళిత వ్యక్తి ఇంటిపై దాడి చేసి, ఆయన భార్యపై చేయి చేసుకున్న ఘటన కావడంతోనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వివరించారు.

### అక్రమ అరెస్ట్ అంటున్న వైసీపీ

అయితే, ఈ అరెస్టును వైసీపీ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇది కక్షపూరితమైన, అక్రమ అరెస్ట్ అని ఆరోపించారు. తమ పార్టీ నేత గిరి ఇంటిపై టీడీపీ నాయకులే మొదట దాడికి ప్రయత్నించగా, ఎమ్మెల్యే విరూపాక్షి అక్కడికి విచారణకు వెళ్లారని తెలిపారు. ఆ సమయంలో టీడీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వడంతో ఎమ్మెల్యే సోదరుడు శ్రీరామకు గాయాలయ్యాయని చెప్పారు. తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు, అర్ధరాత్రి ఎమ్మెల్యేను, ఆయన కుమారుడిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఇంటిలోని సీసీటీవీ హార్డ్ డిస్క్‌లను కూడా పోలీసులు తీసుకెళ్లారని వారు పేర్కొన్నారు.

### ఫ్యాక్ట్ చెక్ తో బదులిచ్చిన ఏపీ ప్రభుత్వం

ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అక్రమ అరెస్టు అంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యం అని ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేసింది. "ఎస్సీ వర్గానికి చెందిన ఒక వ్యక్తి ఇంటిపై దాడి చేసి అతని భార్య పై దౌర్జన్యం చేసి ఆమె వస్త్రాలు చించిన కేసులో ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు అయ్యారు. వాస్తవం ఏమిటంటే.. ఆలూరు నియోజకవర్గం, చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో ఒక పార్టీ నాయకుడు గిరి (యాదవ్), మరొక పార్టీ నాయకులైన గురునాథ్ (యాదవ్), శివ, నాగరాజు (ఎస్సీ మాదిగ) లను అసభ్య పదజాలంతో మాట్లాడారు. ఎందుకు అలా మాట్లాడావని నాగరాజు ప్రశ్నించినందుకు గిరి ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేయగా, ఆయన తన అనుచరులతో కలిసి సుమారు 10 కార్లలో అక్కడకు చేరుకున్నారు. వారు నాగరాజు ఇంటిలోకి దౌర్జన్యంగా చొరబడి, ఎమ్మెల్యే సమక్షంలోనే ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. ఈ దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన నాగరాజు భార్య సుచిత్రపై చేయిచేసుకుని ఆమె నైటీని చింపేశారు. అలాగే వారిని వారించబోయిన రాజశేఖర్, నాగరాజు అన్నపై కూడా విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ విషయం తెలుసుకుని పరామర్శించడానికి వచ్చిన స్థానిక నాయకుడు కొండా పురుషోత్తం కారును ధ్వంసం చేశారు. ఈ ఘటనలో గాయపడిన బాధితులను చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. జరిగింది ఇది కాగా అక్రమంగా పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రచారం చేయడం సబబు కాదు" అని ఏపీ ఫ్యాక్ట్ చెక్ వివరించింది. కాగా, ఈ అరెస్టులతో ఆలూరు నియోజకవర్గంలో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ మధ్య రాజకీయ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

# గోదావరి ఉగ్రరూపం.. ఇంకా ముంపులోనే లంక గ్రామాలు




- గోదావరికి కొనసాగుతున్న వరద ఉధృతి
- కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాల్లో ముంపులో లంక గ్రామాలు
- పలు గ్రామాలకు నిలిచిపోయిన బోట్లు, రవాణా సౌకర్యాలు

ముమ్మిడివరం ( సింధూర దర్శిని) 2 ఆగస్టు: ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వశిష్ఠ, గౌతమి పాయలు అప్రమత్తమైన అధికారులు, కొనసాగుతున్న సహాయక చర్యలు ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. వరద పోటెత్తడంతో కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు వణికిపోతున్నాయి. స్థానికంగా వర్షాలు తగ్గుముఖం పట్టినా, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటకల నుంచి భారీగా వస్తున్న వరద నీటితో గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో లంక గ్రామాలు నీట మునిగి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోనసీమ జిల్లాలోని అనేక లంక గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలోని లంక గ్రామాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గోగులంక, గుత్తెనదీవి, కేసనకుర్రు వంటి ప్రాంతాల్లో బోట్ల సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. తానేలంక – గురజాపులంక మధ్య రహదారిపై వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. అప్పనపల్లి, ముక్తేశ్వరం, కనకాయలంక, అయ్యినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక వంటి అనేక గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొబ్బరి రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ట్రాక్టర్ల సహాయంతో కాయలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాజమండ్రి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నదీ తీరం కోతకు గురవుతోంది. అధికారులు ఇసుక బస్తాలు వేసి కోతను అరికట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చింతపల్లి వద్ద, గౌతమి పాయ ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. అయితే, గత రాత్రితో పోలిస్తే ప్రవాహం స్వల్పంగా తగ్గింది. భారీగా వస్తున్న వరద నీరు సముద్రంలోకి వెళుతోంది. మరోవైపు, ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే బాలరాజు, ఎస్పీ ప్రశాంత్ కిశోర్ పరిశీలించారు. అధికారులు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి, లంక గ్రామాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. కలెక్టర్ మహేశ్ కుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, అధికారులకు తగిన సూచనలు జారీ చేస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరం చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.

# అమెరికా రైతులకు గుడ్లగూబల సాయం.. ద్రాక్ష తోటల్లో ఎలుకలకు చెక్!

- కాలిఫోర్నియా ద్రాక్ష తోటల్లో ఎలుకల నియంత్రణకు గుడ్లగూబలు
- గుడ్లగూబలు ఉన్నచోట 52 శాతం వరకు తగ్గిన ఎలుకల సంఖ్య
- గుడ్లగూబల భయంతో బయటకు రాని ఎలుకలు
- విష రసాయనాల వాడకం తగ్గించడంలో కీలక పాత్ర
- అమెరికా శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడైన వాస్తవాలు



**కాలిఫోర్నియా:** వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి సిద్ధమైన పద్ధతులను అనుసరించడంపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతోంది. ఈ క్రమంలో అమెరికాలోని కాలిఫోర్నియా ద్రాక్ష రైతులు ఒక వినూత్న ప్రయోగంతో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారు. పంటను నాశనం చేసే ఎలుకలను నియంత్రించేందుకు వారు గుడ్లగూబల సహాయం తీసుకుంటున్నారు. ఎలాంటి విష రసాయనాలు లేకుండానే కేవలం గుడ్లగూబల ద్వారా ఎలుకల బెడదను 50 శాతానికి పైగా తగ్గించగలిగినట్లు ఇటీవలి ఒక శాస్త్రీయ అధ్యయనం స్పష్టం చేసింది.కాల్ పాలీ హంబోల్ట్, యూసీ డెవిస్ విశ్వవిద్యాలయాలకు చెందిన వన్యప్రాణి నిపుణులు నాపా వ్యాలీలోని ఆరు ద్రాక్ష తోటల్లో ఈ పరిశోధన నిర్వహించారు. 2015 నుంచి ఈ ప్రాంతంలోని 500కు పైగా గుడ్లగూబ గూడు పెట్టెల (నెస్ట్ బాక్స్‌లు) పనితీరును వారు పర్యవేక్షిస్తున్నారు. 2023లో జరిపిన అధ్యయనంలో, గుడ్లగూబల సంచారం ఎక్కువగా ఉన్న పొలాల్లో ఎలుకల సంఖ్య 38 నుంచి 52 శాతం వరకు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. ఈ పరిశోధన వివరాలు 'ఎకలాజికల్ అప్లికేషన్స్' అనే సైన్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.గుడ్లగూబలు కేవలం ఎలుకలను వేటాడి చంపడమే కాకుండా, వాటి ఉనికితోనే ఎలుకల ప్రవర్తనలో మార్పు తీసుకువస్తున్నాయని పరిశోధకులు తెలిపారు. గుడ్లగూబలు సమీపంలో ఉన్నాయనే భయంతో ఎలుకలు బయటకు రావడానికి, ఆహారం కోసం స్వేచ్ఛగా తిరగడానికి జంకుతున్నాయి. దీనివల్ల పంటకు వాటి ద్వారా జరిగే నష్టం గణనీయంగా తగ్గుతోంది. ఒక గుడ్లగూబ కుటుంబం ఏడాదికి సుమారు 4,000 ఎలుకలను ఆహారంగా తీసుకుంటుందని అంచనా. ఈ సహజ నియంత్రణ పద్ధతిని విజయవంతం చేయడానికి, రైతులు తమ పొలాల్లో గుడ్లగూబలు నివసించేందుకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నారు. సుమారు 12 అడుగుల ఎత్తు ఉన్న స్తంభాలకు 24 అంగుళాల పొడవైన చెక్క గూడు పెట్టెలను ఏర్పాటు చేస్తున్నారు. ఇలా కొత్తగా ఏర్పాటు చేసిన గూళ్లలోకి గుడ్లగూబలు వచ్చి చేరడానికి 1 నుంచి 3 సంవత్సరాల సమయం పట్టవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ పద్ధతి ద్వారా విష రసాయనాలపై ఆధారపడటం తగ్గిందని, సమగ్ర సస్యరక్షణలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని గ్రిగిచ్ హిల్స్ ఎస్టేట్ వంటి ద్రాక్ష తోటల యజమానులు అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయం, జీవవైవిధ్యం పరస్పరం ఎలా ప్రయోజనం చేకూర్చుకుంటాయో చెప్పడానికి ఈ ప్రయోగం ఒక చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది.

# జింబాబ్వేలో 21 కోట్ల ఏళ్ల నాటి డైనోసార్.. వెలుగులోకి కొత్త జాతి

- జింబాబ్వేలో 21 కోట్ల సంవత్సరాల క్రితం నాటి డైనోసార్ శిలాజాలు
- దీనికి 'ముసాంగో మటుసాడోనెన్సిస్' అని కొత్తగా నామకరణం
- భారీ శాకాహార డైనోసార్ల తొలితరం జాతికి చెందినదిగా నిర్ధారణ
- ఈ ఆవిష్కరణతో డైనోసార్ల పరిణామంపై కీలక సమాచారం వెల్లడి
- ఆఫ్రికాలో మరిన్ని పురాజీవ ఆవిష్కరణలకు అవకాశం ఉందని వెల్లడి



**జింబాబ్వే:** జింబాబ్వేలోని కరిబా సరస్సు తీరంలో శాస్త్రవేత్తలు ఒక కీలక ఆవిష్కరణ చేశారు. సుమారు 21 కోట్ల సంవత్సరాల క్రితం జీవించిన, ఇప్పటివరకు ప్రపంచానికి తెలియని ఒక కొత్త డైనోసార్ జాతిని గుర్తించారు. ఈ ఆవిష్కరణ డైనోసార్ల తొలిదశ పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవడంలో కొత్త కోణాలను ఆవిష్కరిస్తోంది. ఈ పరిశోధన వివరాలు 'జర్నల్ ఆఫ్ సిస్టమాటిక్ పాలియంటాలజీ'లో ప్రచురితమయ్యాయి. 2018లో జింబాబ్వే, దక్షిణాఫ్రికా, యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన పరిశోధకుల బృందం కరిబా సరస్సులోని స్పర్‌వింగ్ ద్వీపంలో ఈ శిలాజాలను కనుగొంది. లండన్‌లోని నేచురల్ హిస్టరీ మ్యూజియానికి చెందిన పాలియంటాలజిస్ట్, ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన ప్రొఫెసర్ పాల్ బారెట్ సరస్సు ఒడ్డున నడుస్తుండగా, నేల నుంచి బయటకు చొచ్చుకువస్తున్న ఎముకలను గమనించారు. వెంటనే ఆ ప్రాంతంలో తవ్వకాలు జరపగా, డైనోసార్ వెనుక కాలుకు చెందిన తొడ, కింది కాలు, చీలమండ ఎముకలు లభించాయి. ఈ ఎముకల నిర్మాణం భిన్నంగా ఉండటంతో ఇది కొత్త జాతి అని నిర్ధారించారు. తాను ఎన్నో డైనోసార్ జాతులకు పేర్లు పెట్టినా, స్వయంగా కనుగొన్న డైనోసార్‌ను వర్ణించడం ఇదే తొలిసారని బారెట్ ఆనందం వ్యక్తం చేశారు.
ఈ కొత్త జాతికి 'ముసాంగో మటుసాడోనెన్సిస్' (Musango matusadonaensis) అని పేరు పెట్టారు. పరిశోధన సమయంలో బృందం నివాసంగా, ప్రయోగశాలగా ఉపయోగించుకున్న 'ముసాంక్వా' అనే హౌస్‌బోట్ పేరు మీదుగా ఈ డైనోసార్‌కు ఈ పేరు ఖరారు చేశారు. ఇది సుమారు 21 కోట్ల ఏళ్ల క్రితం, లేట్ ట్రయాసిక్ యుగంలో జీవించింది. ఈ డైనోసార్ తుంటి భాగంలో సుమారు 1.5 మీటర్ల (5 అడుగుల) ఎత్తు, దాదాపు 390 కిలోల బరువు ఉండేదని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.
ఇది 'సారోపోడోమార్ఫ్' (sauropodomorph) సమూహానికి చెందినది. ఈ జాతి డైనోసార్లే కాలక్రమేణా భారీ శరీరం, పొడవాటి మెడ కలిగిన 'సారోపాడ్స్'గా పరిణామం చెందాయి. భూమిపై జీవించిన అతిపెద్ద జంతువులలో ఇవి కూడా ఒకటి. ఈ 'ముసాంగో' డైనోసార్ జాతికి అర్జెంటీనా, దక్షిణాఫ్రికాలో లభించిన డైనోసార్లతో దగ్గరి సంబంధాలు ఉన్నాయని పరిణామ విశ్లేషణలు సూచిస్తున్నాయి. ఆ కాలంలో భూఖండాలన్నీ కలిసి ఉండటంతో డైనోసార్లు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి స్వేచ్ఛగా విస్తరించాయని దీనివల్ల స్పష్టమవుతోంది. ఆఫ్రికాలో ఇంకా వెలుగు చూడని ఎన్నో పురాజీవ శాస్త్ర రహస్యాలు ఉన్నాయనడానికి ఈ ఆవిష్కరణ ఒక నిదర్శనమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ బృందంలోని డాక్టర్ కింబర్లీ చాపెల్ మాట్లాడుతూ.. ఇతర ఖండాలతో పోలిస్తే ఆఫ్రికాలో చాలా తక్కువ స్థాయిలో అన్వేషణ, తవ్వకాలు జరగడం వల్లే ఇక్కడ డైనోసార్ శిలాజాలు తక్కువగా లభించాయని వివరించారు. 'ముసాంగో' ఆవిష్కరణ, ఈ ప్రాంతంలో భవిష్యత్తులో మరిన్ని కీలక ఆవిష్కరణలు జరగడానికి బాటలు వేస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# ముంబై దాదర్ స్టేషన్‌లో హైడ్రామా.. క్షణాల్లో వ్యక్తిని కాపాడిన మహిళా కానిస్టేబుల్





- ముంబై దాదర్ స్టేషన్‌లో కదులుతున్న రైలు కిందపడి ఆత్మహత్యాయత్నం
- అప్రమత్తంగా వ్యవహరించి వ్యక్తిని కాపాడిన మహిళా కానిస్టేబుల్
- ప్లాట్‌ఫామ్‌పై ఉన్న సీసీటీవీలో రికార్డైన నాటకీయ దృశ్యాలు
- మహిళా పోలీస్ సాహసంపై నెటిజన్ల ప్రశంసల వర్షం
- యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చి పునరావాస కేంద్రానికి తరలింపు

**ముంబై:** ముంబైలోని దాదర్ రైల్వే స్టేషన్‌లో ఓ మహిళా కానిస్టేబుల్ అప్రమత్తంగా వ్యవహరించి పెను ప్రమాదాన్ని నివారించారు. ఆత్మహత్య చేసుకునేందుకు కదులుతున్న లోకల్ ట్రైన్ కిందకు వెళ్లబోయిన ఓ వ్యక్తిని ఆమె క్షణాల్లో కాపాడారు. గురువారం రాత్రి 10:54 గంటల సమయంలో జరిగిన ఈ నాటకీయ ఘటన స్టేషన్‌లోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డైంది. వివరాల్లోకి వెళితే.. ప్లాట్‌ఫామ్ నుంచి లోకల్ ట్రైన్ నెమ్మదిగా కదులుతుండగా, 28 ఏళ్ల యువకుడు రైలు కిందకు వెళ్లేందుకు ప్రయత్నించాడు. అక్కడే విధుల్లో ఉన్న ఏ. నర్వాడే అనే మహిళా కానిస్టేబుల్ వెంటనే స్పందించారు. వేగంగా పరుగెత్తుకెళ్లి, ఆ వ్యక్తి కాళ్లు పట్టుకుని వెనక్కి లాగేశారు. దీంతో అతడు ప్రాణాలతో బయట పడ్డాడు. అతనికి ఎలాంటి పెద్ద గాయాలు కాలేదని, పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. అధికారులు అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి, పునరావాస కేంద్రానికి తరలించనున్నట్లు సమాచారం. ఈ రెస్క్యూకు సంబంధించిన వీడియో 'ఎక్స్' (ట్విట్టర్)లో షేర్ చేయగా, ఆ మహిళా అధికారిణి సాహసంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. "ఆ మహిళా అధికారిణి అద్భుతంగా పనిచేశారు", "ఒక ప్రాణాన్ని కాపాడిన అధికారిణికి సెల్యూట్" అంటూ కామెంట్లు పెడుతున్నారు.

# బెంగాల్ సీఎం టార్గెట్‌గా ఉగ్రకుట్ర.. హనీట్రాప్‌తో భారీ స్కెచ్.. విచారణలో షాకింగ్ నిజాలు!

- పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి లక్ష్యంగా ఉగ్రకుట్ర
- పాక్‌కు చెందిన జైషే మహమ్మద్ ఉగ్రవాది హామీమ్ మండల్ అరెస్ట్
- హనీట్రాప్ ద్వారా సమాచారం సేకరించిన ఉగ్రవాది ప్రియురాలు అర్పితా సర్కార్
- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అల్లర్లు సృష్టించేందుకు పథకం
- మంత్రి కుమారుడిని కిడ్నాప్ చేసి డబ్బు డిమాండ్ చేయాలని కూడా ప్లాన్



**పశ్చిమ బెంగాల్:** పశ్చిమ బెంగాల్‌లో సంచలనం సృష్టించిన భారీ ఉగ్రవాద కుట్రను 'స్పెషల్ టాస్క్ ఫోర్స్' (ఎస్‌టీఎఫ్) అధికారులు భగ్నం చేశారు. రాష్ట్ర ముఖ్య మంత్రి సువేందు అధికారిని లక్ష్యంగా చేసుకోవడంతో పాటు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసనల్లో అలజడి సృష్టించేందుకు పథకం పన్నిన ఉగ్రవాదిని అరెస్ట్ చేశారు. పాకిస్థాన్‌కు చెందిన జైషే మహమ్మద్ (జేఎమ్) ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్న హామీమ్ మండల్‌ను రెండు రోజుల క్రితం పూర్వ బర్ధమాన్ జిల్లాలో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌టీఎఫ్ వెల్లడించింది. ఈ కేసు విచారణలో భాగంగా హామీమ్ ప్రియురాలు అర్పితా సర్కార్‌ను కూడా జార్ఖండ్‌లో అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలోకి పోలీసు యూనిఫాంలో చొరబడి, గందరగోళం సృష్టించాలని హామీమ్ మండల్‌కు పాకిస్థాన్‌లోని అతని హ్యాండ్లర్ల నుంచి ఆదేశాలు అందాయని ఎస్‌టీఎఫ్ ఐజీ గౌరవ్ శర్మ మీడియా సమావేశంలో తెలిపారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి సువేందు అధికారి కదలికలపై నిఘా పెట్టాలని, ఆయనకు భద్రత తక్కువగా ఉండే ప్రదేశాల సమాచారాన్ని సేకరించాలని కూడా అతనికి సూచించినట్లు ఐజీ వివరించారు. "ముఖ్యమంత్రి వారి లక్ష్యాల్లో ఒకరు. ఆయనపై దాడి చేసేందుకు అనువైన సమయం కోసం చూస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ కుట్రలో హామీమ్ ప్రియురాలు అర్పితా సర్కార్ పాత్ర కూడా కీలకమని అధికారులు గుర్తించారు. పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులను అర్పిత హనీట్రాప్ చేసి, వారి నుంచి కీలక సమాచారాన్ని రాబట్టి హామీమ్‌కు చేరవేసేదని తేలింది. వీరిద్దరూ కలిసి రాష్ట్ర మంత్రి ఉమేష్ రే కుమారుడిని కిడ్నాప్ చేసి, డబ్బు డిమాండ్ చేయాలని కూడా పథకం పన్నినట్లు విచారణలో బయటపడింది. పాకిస్థాన్‌కు చెందిన షాజాద్ భట్టి గ్యాంగ్‌తో సంబంధమున్న హ్యాండ్లర్ల ఆదేశాల మేరకే వీరు పనిచేస్తున్నారని అధికారులు నిర్ధారించారు. అర్పిత వాట్సాప్ చాట్‌లలో పాకిస్థాన్‌తో ఉన్న సంబంధాలు బయటపడ్డాయి. హామీమ్, అర్పిత నుంచి యూకే, మెక్సికో దేశాలకు చెందిన అంతర్జాతీయ సిమ్ కార్డులను ఎస్‌టీఎఫ్ స్వాధీనం చేసుకుంది. ఈ సిమ్‌లను ఉపయోగించి తమ పాకిస్థానీ హ్యాండ్లర్లు, స్లీపర్ సెల్స్‌తో ఎన్‌క్రిప్టెడ్ పద్ధతిలో సంభాషణలు జరిపినట్లు అనుమానిస్తున్నారు. సోషల్ మీడియా ద్వారానే హామీమ్ ఉగ్రవాదం వైపు ఆకర్షితుడై, పాక్ ఆపరేటివ్‌ల కోసం పనిచేయడం ప్రారంభించాడని దర్యాప్తులో తేలింది. 'రాణా', 'ఉజైర్', 'అబిద్ జాట్ 333', 'హమద్' అనే కోడ్ పేర్లతో ఉన్న హ్యాండ్లర్లు షాజాద్ భట్టి గ్యాంగ్‌కు చెందిన వారని అనుమానిస్తున్నారు. ఈ గ్యాంగ్ యువతను ఉగ్రవాదం వైపు ప్రేరేపించడం, రిక్రూట్‌మెంట్లు, నార్కో-టెర్రర్ కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన హామీమ్, అర్పిత నాలుగేళ్లుగా సంబంధంలో ఉన్నారు. హనీట్రాప్ కేసు దర్యాప్తులో భాగంగా అర్పిత సోషల్ మీడియా ఖాతాపై నిఘా పెట్టిన ఎస్‌టీఎఫ్‌కు హామీమ్ ఆచూకీ లభించింది. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, 14 రోజుల ఎస్‌టీఎఫ్ కస్టడీకి అనుమతించారు. ఈ ఉగ్రవాద నెట్‌వర్క్ ఎంతవరకు విస్తరించి ఉంది, ఇందులో ఇంకా ఎవరెవరు సభ్యులుగా ఉన్నారు, సరిహద్దు ఆవల ఉన్న సంబంధాలపై లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, కేసు సున్నితత్వం దృష్ట్యా మరిన్ని వివరాలు వెల్లడించలేమని సీనియర్ అధికారి తెలిపారు.



# ఫ్రెండ్‌షిప్ డే రోజున విషాదం.. పాత గంగవరం బీచ్‌లో ఇద్దరు గల్లంతు

- విశాఖ గంగవరం బీచ్‌లో స్నేహితుల రోజున విషాద ఘటన
- సముద్రపు అలలకు కొట్టుకుపోయిన యువతిని కాపాడబోయిన యువకుడు
- ప్రమాదంలో ఇద్దరూ గల్లంతవ్వడంతో తీవ్ర ఆందోళన
- కొద్దిరోజుల్లో వివాహం జరగాల్సిన యువకుడు గల్లంతవడంతో కుటుంబంలో విషాదం
- గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, లైఫ్‌గార్డులు

విశాఖ ( సింధూర దర్శిని) 2 ఆగస్టు స్నేహితుల దినోత్సవం రోజున విశాఖపట్నంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సరదాగా గడిపేందుకు సముద్ర తీరానికి వెళ్లిన స్నేహితుల బృందంలో ఇద్దరు భారీ అలల తాకిడికి గల్లంతయ్యారు. ఒకరిని కాపాడే ప్రయత్నంలో మరొకరు కూడా ప్రమాదానికి గురవ్వడం తీవ్ర ఆవేదనకు గురిచేసింది. ఈ హృదయవిదారక ఘటన పెదగంట్యాడ మండలం పరిధిలోని పాత గంగవరం బీచ్‌లో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే, ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా నలుగురు యువతులు, ముగ్గురు యువకులతో కూడిన ఏడుగురు స్నేహితుల బృందం సరదాగా గడిపేందుకు గంగవరం బీచ్‌కు వెళ్లింది. వారంతా సముద్ర తీరంలో నిల్చొని ఫోటోలు దిగుతుండగా, ఓ పెద్ద కెరటం బలంగా వారిని తాకింది. ఈ ఘటనలో జాలరిపేటకు చెందిన నీతూ (18) అనే యువతి అదుపుతప్పి సముద్రంలోకి కొట్టుకుపోయింది. నీతూ నీటిలో కొట్టుకుపోవడాన్ని గమనించిన పెందుర్తికి చెందిన దామోదర్ వెంటనే ఆమెను రక్షించేందుకు సముద్రంలోకి దూకాడు. అయితే, అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో అతను కూడా ప్రవాహంలో చిక్కుకుని గల్లంతయ్యాడు. కళ్ల ముందే ఇద్దరూ నీటిలో మునిగిపోవడంతో మిగతా స్నేహితులు భయాందోళనలతో కేకలు వేశారు. గల్లంతైన నీతూ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. దామోదర్‌కు కనకమహాలక్ష్మి అనే యువతితో మరికొద్ది రోజుల్లో వివాహం జరగాల్సి ఉంది. ఇప్పటికే పెళ్లి పనులు కూడా ప్రారంభమైన తరుణంలో ఈ దుర్ఘటన జరగడంతో అతని కుటుంబంలో పెను విషాదం అలుముకుంది. సమాచారం అందుకున్న న్యూ పోర్ట్ పోలీసులు, బీచ్ లైఫ్‌గార్డులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండటం గాలింపు పనులకు ఆటంకం కలిగిస్తోందని, అయినప్పటికీ గాలింపు కొనసాగిస్తున్నామని అధికారులు తెలిపారు.

# బోరబండలో కారు బీభత్సం.. మైనర్ బాలుడి డ్రైవింగ్.. ఇద్దరికి తీవ్ర గాయాలు

- హైదరాబాద్ బోరబండలో కారుతో మైనర్ బీభత్సం
- ఏడు బైక్‌లను ఢీకొట్టి, ఇద్దరిపైకి దూసుకెళ్లిన వాహనం
- ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు, కారు కింద నలిగిపోయిన వైనం
- పారిపోయేందుకు యత్నించిన మైనర్‌ను పట్టుకున్న స్థానికులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



హైదరాబాద్ ( సింధూర దర్శిని) 2 ఆగస్టు: హైదరాబాద్‌లో ఆదివారం ఓ మైనర్ బాలుడు లైసెన్స్ లేకుండా కారు నడిపి బీభత్సం సృష్టించాడు. బోరబండ ప్రాంతంలో మారుతి బాలెనో కారుపై నియంత్రణ కోల్పోయి, మొదట పార్కింగ్ చేసి ఉన్న ఏడు ద్విచక్రవాహనాలను ఢీకొట్టాడు. అనంతరం చర్చికి వెళుతున్న ఇద్దరు సోదరులు ప్రయాణిస్తున్న బైక్‌పైకి కారును దూసుకెళ్లడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదమంతా అక్కడి సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యింది. కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న రాజ్ కుమార్ (60), ప్రభాకర్ (55) అనే సోదరులు కిందపడిపోయారు. ఈ ఘటనలో ప్రభాకర్‌కు స్వల్ప గాయాలు కాగా, రాజ్ కుమార్ కారు కింద చిక్కుకుపోయారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి పరుగెత్తుకొచ్చి, కారును పైకి లేపి అతడిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ వేర్వేరు ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం జరిగిన తర్వాత ఆ 17 ఏళ్ల బాలుడు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అయితే, స్థానికులు అతడిని వెంబడించి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలో స్థానికులు బాలుడిపై దాడి చేసినట్టు కూడా తెలుస్తోంది. కారు వాషింగ్ చేసిన తర్వాత తాళాలు అందులోనే ఉండటంతో, బాలుడు సరదాగా డ్రైవింగ్ కోసం కారును బయటకు తీసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

## భరత్‌ను పరామర్శించిన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు

బాపట్ల, ( సింధూర దర్శిని) 2 ఆగస్టు : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాపట్ల జిల్లా ప్రెస్ క్లబ్ సభ్యుడు, జర్నలిస్టు బడుగు భరత్‌ను జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేజండ్ల శ్రీనివాసరావు ఆదివారం పరామర్శించారు. గుంటూరులోని మైత్రి ఆస్పత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్యం కోసం భరత్‌ను మైత్రి ఆస్పత్రి నుంచి వికాస్ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. భరత్ త్వరగా కోలుకుని తిరిగి పాత్రికేయ విధుల్లో చేరాలని శ్రీనివాసరావుతో పాటు జిల్లా ప్రెస్ క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు.



## పొగతాగకపోయినా లంగ్ క్యాన్సర్.. ఇంట్లో ఈ పొరపాట్లు చేస్తున్నారా?

- పొగతాగని వారిలో పెరుగుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు
- వంటగదిలో వెలువడే పొగతో మహిళలకు అధిక ప్రమాదం
- మూసి ఉన్న గదుల్లో దోమల బత్తీల వాడకం అత్యంత ప్రమాదకరం
- కట్టెల పొయ్యి, పిడకల పొగ కూడా క్యాన్సర్‌కు ఒక ప్రధాన కారణం

బయటి వాయు కాలుష్యం ఇంట్లోకి చేరడంతోనూ పెరుగుతున్న ముప్పు ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రధాన కారణం పొగతాగడమే అయినా, ప్రపంచవ్యాప్తంగా ఈ అలవాటు లేని వారిలో కూడా ఈ వ్యాధి కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. సురక్షితం అనుకునే మన ఇంట్లోని వాతావరణంలోనే ఇందుకు కారణమైన అనేక ప్రమాదకర అంశాలు దాగి ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా నమోదయ్యే లంగ్ క్యాన్సర్ కేసుల్లో దాదాపు 25 శాతం పొగతాగని వారిలోనే ఉంటున్నాయి. తూర్పు ఆసియా దేశాల్లో ఈ సంఖ్య 50 శాతం వరకు ఉండటం ఆందోళన కలిగిస్తోంది.మన ఇళ్లలో రోజూ చేసే పనులే ఈ ముప్పునకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా వంటగదిలో అధిక వేడి మీద వంట చేయడం, నూనెలో వేయించడం, తాలింపు పెట్టడం వంటివి చేసేటప్పుడు నూనె నుంచి వచ్చే పొగలో సూక్ష్మ రేణువులు, క్యాన్సర్‌కు కారణమయ్యే రసాయనాలు ఉంటాయి. సరైన గాలి, వెలుతురు లేని కిచెన్‌లో దీర్ఘకాలం పాటు వంట చేసే మహిళల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు పలు అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. వంటగదిలో వెంటిలేషన్ మెరుగుపర్చుకోవడం ద్వారా ఈ ముప్పును తగ్గించుకోవచ్చని సూచిస్తున్నాయి.అలాగే, ఇళ్లలో సాధారణంగా వాడే దోమల బత్తీలు కూడా అత్యంత ప్రమాదకరమైనవి. వీటిని గంటల తరబడి, ముఖ్యంగా తలుపులు మూసి ఉన్న గదుల్లో కాల్చడం వల్ల వెలువడే పొగలో సిగరెట్ పొగలో ఉండే హానికరమైన రసాయనాలకు సమానమైనవి కొన్ని ఉంటాయి. దోమల బత్తీలను రోజూ వాడేవారిలో, వాడని వారితో పోలిస్తే ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పు చాలా ఎక్కువగా ఉంటున్నట్లు పరిశోధనల్లో తేలింది. పొగతాగే వారితో పాటు ఈ బత్తీల పొగను పీల్చడం వల్ల ప్రమాదం రెట్టింపు అవుతుంది.భారత్ వంటి దేశాల్లో, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో కట్టెల పొయ్యి, పిడకలు, వ్యవసాయ వ్యర్థాలను వంట కోసం వాడటం ఈ సమస్యను మరింత తీవ్రం చేస్తోంది. సరైన గాలి ప్రసరణ లేని ఇళ్లలో ఈ పొగను పీల్చడం వల్ల ఊపిరితిత్తులతో పాటు ఇతర శ్వాసకోశ క్యాన్సర్ల బారిన పడుతున్నారు. మరోవైపు నగరాల్లో బయటి వాయు కాలుష్యం కూడా ప్రమాదకరంగా మారింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాలను మించి నమోదవుతున్న ౹పీ2.5 వంటి సూక్ష్మ ధూళి కణాలు ఇళ్లలోకి ప్రవేశించి క్యాన్సర్‌కు కారణమవుతున్నాయి. వీటిని గ్రూప్ 1 క్యాన్సర్ కారకంగా అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధన ఏజెన్సీ వర్గీకరించింది.వీటితో పాటు ఇళ్ల కింది అంతస్తుల్లోకి భూమి నుంచి వచ్చే రాడాన్ గ్యాస్, పూజల కోసం వాడే అగరుబత్తీల పొగ, ఇతరులు తాగే సిగరెట్ పొగను పీల్చడం (సెకండ్‌హ్యాండ్ స్మోక్) వంటివి కూడా ప్రమాద కారకాలే. అయితే, వీటిలో ఏవీ నేరుగా పొగతాగడంతో సమానమైన ప్రమాదాన్ని కలిగించవు. అప్పుడప్పుడు వీటి బారిన పడితే పెద్దగా నష్టం ఉండదు. కానీ, ఏళ్ల తరబడి నిరంతరం ఈ వాతావరణంలో ఉండటం వల్ల ముప్పు పెరుగుతుంది.వంటగదిలో మంచి వెంటిలేషన్ ఏర్పాటు చేసుకోవడం, కిటికీలు తెరిచి ఉంచడం, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు వాడటం, మూసి ఉన్న గదుల్లో దోమల బత్తీల వాడకాన్ని తగ్గించడం, శుద్ధమైన వంట ఇంధనాలకు మారడం ద్వారా ఈ ప్రమాదాలను చాలా వరకు నివారించుకోవచ్చు. పొగతాగే అలవాటు లేకపోయినా, దీర్ఘకాలంగా దగ్గు, కారణం లేకుండా ఆయాసం రావడం, కుటుంబంలో ఎవరికైనా లంగ్ క్యాన్సర్ చరిత్ర ఉండటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## ప్రియురాలితో కలిసి శ్రీవారిని దర్శించుకున్న హార్దిక్ పాండ్యా

- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న క్రికెటర్ హార్దిక్ పాండ్యా
- స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కు చెల్లింపు



తిరుమల (సింధూర దర్శిని) 2 ఆగస్టు : టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నాడు. తన ప్రియురాలు మహికా శర్మతో కలిసి ఈరోజు వేకువజామున ఆలయానికి చేరుకున్న పాండ్యా, స్వామివారి సుప్రభాత సేవలో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా పాండ్యా తన మొక్కు చెల్లించుకుంటూ శ్రీవారికి తలనీలాలు సమర్పించాడు.సంప్రదాయ తెల్ల కుర్తా-పైజామా ధరించి, గుండుతో ఉన్న హార్దిక్ పాండ్యా పూర్తిగా కొత్త రూపంలో కనిపించాడు. తిరుమల పురవీధుల్లో అతడిని చూసిన అభిమానులు, భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. తిరుమల క్షేత్రంలో తలనీలాలు సమర్పించడం భక్తికి చిహ్నంగా, ముఖ్యమైన మొక్కుగా భక్తులు భావిస్తారు.దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు హార్దిక్ పాండ్యా, మహికా శర్మలకు వేదాశీర్వచనాలు అందించారు. ఆ తర్వాత వారికి స్వామివారి తీర్థప్రసాదాలను, పట్టువస్త్రాలను అందజేశారు. ప్రస్తుతం హార్దిక్ పాండ్యాకు సంబంధించిన ఫొటోలు, వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టును ఐదేళ్లు ఆపింది జగనే!: పెమ్మసాని ఫైర్

- భోగాపురం ఎయిర్‌పోర్ట్ క్రెడిట్‌పై వైసీపీ వాదనలను తీవ్రంగా ఖండించిన కేంద్రమంత్రి పెమ్మసాని
- కోర్టు కేసులతో ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసింది జగనేనని ఆరోపణ
- ఐదేళ్ల పాలనలో కనీసం ఒక్క కనెక్టివిటీ రోడ్డు కూడా వేయలేదని విమర్శ
- కూటమి ప్రభుత్వం వచ్చాకే పనులు వేగవంతం చేసి ప్రాజెక్టును పూర్తి చేశామని స్పష్టీకరణ
- రీ-టెండరింగ్ డ్రామాతో కాలయాపన చేసి, ఉత్తరాంధ్ర యువత ఉపాధిని దెబ్బతీశారని ఫైర్



అమరావతి, (సింధూర దర్శిని) 2 ఆగస్టు : భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఘనత తమదేనంటూ వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తీవ్రంగా ఖండించారు. ఆ ప్రాజెక్టును నిర్మించడం కాదు కదా, ఐదేళ్ల పాటు ఉద్దేశపూర్వకంగా అడ్డుకొని, కాలయాపన చేసి, ఉత్తరాంధ్ర అభివృద్ధిని దెబ్బతీసిన పాపం పూర్తిగా జగన్ ప్రభుత్వానిదేనని ఆయన ఘాటుగా విమర్శించారు. భోగాపురం ప్రాజెక్టు వెనుక ఉన్న వాస్తవాలను ఆయన మీడియా సమావేశంలో వివరించారు. ఈ ప్రాజెక్టు ఆలోచన దగ్గరి నుంచి పూర్తి చేసే వరకు టీడీపీ, కూటమి ప్రభుత్వాలదే కీలక పాత్ర అని, ఇందులో వైసీపీ క్రెడిట్ ఏమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు.

### దార్శనికత టీడీపీది.. అడ్డంకులు వైసీపీవి

విభజిత ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్ తరహాలో ఒక ప్రపంచ స్థాయి అంతర్జాతీయ విమానాశ్రయం అవసరమని 2015లోనే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతిరాజు బలంగా ఆకాంక్షించారని పెమ్మసాని గుర్తుచేశారు. కేవలం ప్రయాణికుల కోసమే కాకుండా, లాజిస్టిక్స్, ఏవియేషన్ హబ్‌గా ఉత్తరాంధ్రను తీర్చిదిద్దాలనే భారీ లక్ష్యంతో 2700 ఎకరాల్లో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారన్నారు. ప్రభుత్వం నిర్వహించిన బిడ్డింగ్‌లో జీఎంఆర్ సంస్థ ముందుకొచ్చిందని, ఆ ప్రాంతంపై అభిమానంతో, చంద్రబాబుపై గౌరవంతో వారు ఈ బృహత్కార్యానికి సిద్ధపడ్డారని తెలిపారు. 2019 నాటికి టీడీపీ ప్రభుత్వం 2200 ఎకరాల భూసేకరణ పూర్తి చేసిందని, అయితే మిగిలిన 500 ఎకరాల సేకరణకు అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న జగనే అడ్డుపడ్డారని పెమ్మసాని సంచలన ఆరోపణలు చేశారు. "ఆయన తన అనుచరులతో రైతులను రెచ్చగొట్టి, కీలకమైన రన్‌వే ప్రాంతంలో భూములకు సంబంధించి కోర్టుల్లో కేసులు వేయించారు. దీనివల్ల ప్రాజెక్టు ముందుకు సాగకుండా ఆగిపోయింది" అని ఆయన వివరించారు.

### ఐదేళ్లలో జగన్ చేసిందేంటి?

2019లో అధికారంలోకి వచ్చాక, జగన్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును వేగవంతం చేయడానికి బదులు, మరింత జాప్యం చేసిందని పెమ్మసాని విమర్శించారు. తానే అడ్డుకున్న 500 ఎకరాల్లో కేవలం 300 ఎకరాలను, అదీ తన అనుచరులకు ఎక్కువ నష్టపరిహారం వచ్చేలా "మేనేజ్" చేసి సేకరించారని, నిజమైన రైతులకు న్యాయం జరగలేదని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును రీ-టెండరింగ్ పేరుతో ఎలాగైతే నిర్వీర్యం చేయాలని చూశారో, అదే తరహాలో భోగాపురంలోనూ అవినీతి జరిగిపోయిందంటూ రీ-టెండరింగ్ డ్రామాకు తెరలేపారన్నారు. అయితే, అంతర్జాతీయ టెండర్లలో మళ్లీ జీఎంఆర్ సంస్థే నంబర్ వన్‌గా నిలిచిందని, పాత షరతులతోనే ఒప్పందం కుదిరిందని, ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం సాధించింది కేవలం ప్రాజెక్టును ఆలస్యం చేయడమేనని ఎద్దేవా చేశారు.

### ఉత్తరాంధ్ర యువతకు తీరని నష్టం

ఈ ప్రాజెక్టు గనుక మూడేళ్ల క్రితమే పూర్తయి ఉంటే, ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,000 మందికి పైగా యువతకు ఉద్యోగాలు లభించేవని పెమ్మసాని ఆవేదన వ్యక్తం చేశారు. "నెలకు రూ.20,000 జీతంతో ఒక్కొక్కరు ఐదేళ్లలో రూ.10 లక్షల ఆదాయం కోల్పోయారు. ఎకరాకు అదనంగా రెండు లక్షలు వస్తాయని ఆశ చూపి, వారి జీవితాల్లో రూ.10 లక్షలు నష్టం చేసిన పాపం జగన్‌ది కాదా? ఇది వాస్తవం కాదంటే దమ్ముంటే చర్చకు రావాలి" అని ఆయన సవాల్ విసిరారు.

### కూటమి వచ్చాకే వేగం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారని పెమ్మసాని తెలిపారు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు దాదాపు 10 సార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి, సమీక్షలు జరిపి మిగిలిన అడ్డంకులను తొలగించారన్నారు. కనెక్టివిటీయే లేని ఎయిర్‌పోర్ట్‌ను హడావుడిగా ప్రారంభించారని వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ.. "ఐదేళ్ల పాటు అధికారంలో ఉండి ఒక్కటంటే ఒక్క రోడ్డు వేశారా? మీరేమీ చేయకుండా ఇప్పుడు విమర్శిస్తారా? మేము వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికన 5 రోడ్ల నిర్మాణం చేపట్టాం. మిగిలిన రెండు కూడా త్వరలోనే పూర్తి చేస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. ప్రారంభంలో ప్రజలకు కొంత అసౌకర్యం ఉన్నప్పటికీ, భవిష్యత్తులో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ తరహాలో భోగాపురం చుట్టూ అద్భుతమైన ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందుతుందని, ఈ విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మొత్తం మీద భోగాపురం ప్రాజెక్టు కూటమి ప్రభుత్వ దార్శనికతకు, పట్టుదలకు నిదర్శనమని, వైసీపీ పాత్ర కేవలం విధ్వంసం, కాలయాపన మాత్రమేనని పెమ్మసాని తేల్చిచెప్పారు.

# మీ ఫోన్ పోయిందా? కంగారు వద్దు.. ఈ పోర్టల్‌తో సులువుగా కనిపెట్టొచ్చు!

- పోయిన, దొంగిలించబడిన ఫోన్ల గుర్తింపునకు కేంద్రం తెచ్చిన సీఈఐఆర్ పోర్టల్
- ఫోన్ పోగానే ఐఎంఈఐ నంబర్‌తో ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి
- కొత్త సిమ్ వేసి ఫోన్ ఆన్ చేయగానే పోలీసులకు సిగ్నల్, లొకేషన్ సమాచారం
- ఈ విధానంతో వేలాది మంది బాధితులు తమ ఫోన్లను తిరిగి పొందుతున్న వైనం



ఫోన్ గుర్తింపులో ఐఎంఈఐ నంబర్ అత్యంత కీలకం

నేటి ఆధునిక జీవనశైలిలో స్మార్ట్‌ఫోన్ ఒక నిత్యావసర వస్తువుగా మారిపోయింది. కేవలం సంభాషణలకే పరిమితం కాకుండా ఆర్థిక లావాదేవీల నుంచి వ్యక్తిగత సమాచారం వరకు అన్నీ ఫోన్‌లోనే దాచుకుంటున్నాం. అలాంటి కీలకమైన ఫోన్ పోయినా లేదా దొంగతనానికి గురైనా కలిగే ఆందోళన అంతా ఇంతా కాదు. ఇలాంటి సమస్యలతో సతమతమవుతున్న వారికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్' (CEIR) పోర్టల్ గొప్ప ఊరటనిస్తోంది. ఈ విధానం ద్వారా వేలాది మంది తమ పోగొట్టుకున్న ఫోన్లను తిరిగి పొందుతూ అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారు.

### సీఈఐఆర్ ఎలా పనిచేస్తుంది?

పోయిన లేదా దొంగిలించబడిన ఫోన్‌ను గుర్తించడంలో 15 అంకెల ఐఎంఈఐ నంబర్ అత్యంత కీలక పాత్ర పోషిస్తుంది. ఫోన్ పోగొట్టుకున్న వెంటనే బాధితులు సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ఆ తర్వాత ceir.gov.in వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి ఫిర్యాదును నమోదు చేయవచ్చు. సాంకేతిక పరిజ్ఞానం లేనివారు మీసేవ కేంద్రాల ద్వారా కూడా ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు.పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయడానికి ఫోన్ నంబర్, ఐఎంఈఐ సంఖ్య, ఫోన్ కంపెనీ, మోడల్, కొనుగోలు చేసిన బిల్లు వంటి వివరాలు అందించాలి. దీంతో పాటు ఫోన్ ఎక్కడ, ఎప్పుడు పోయిందనే సమాచారాన్ని, బాధితుడి పేరు, చిరునామా, గుర్తింపు కార్డు వివరాలను అప్‌లోడ్ చేయాలి. ఓటీపీ కోసం మరో ప్రత్యామ్నాయ ఫోన్ నంబర్‌ను ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఒక రిఫరెన్స్ ఐడీ వస్తుంది.

### ఫోన్‌ను ఎలా గుర్తిస్తారు?

ఫిర్యాదు అందిన వెంటనే, పోలీసులు సీఈఐఆర్ నెట్‌వర్క్‌లో ఆ ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి ట్రాకర్‌ను యాక్టివేట్ చేస్తారు. దొంగలు గానీ, ఫోన్ దొరికిన వారు గానీ అందులో తమ సిమ్ కార్డు వేసి ఆన్ చేసిన మరుక్షణమే ఆ సమాచారం సీఈఐఆర్ వ్యవస్థ ద్వారా పోలీసులకు చేరుతుంది. కొత్త సిమ్ నంబర్, ఫోన్ ఉన్న లొకేషన్ సిగ్నల్స్ పోలీసులకు అందుతాయి. ఈ సమాచారంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ఫోన్‌ను స్వాధీనం చేసుకుంటారు. దొంగతనం చేసినట్లు తేలితే నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటారు. కొన్నిసార్లు సాంకేతిక కారణాలు, విచారణ ప్రక్రియ వల్ల కొంత జాప్యం జరిగినా, ఈ వ్యవస్థ ద్వారా చాలామంది తమ విలువైన ఫోన్లను తిరిగి పొందగలుగుతున్నారు.

# అభిషేక్ శర్మ వీర మాస్ కొట్టుడు.. 25 సిక్సర్లతో ఊచకోత.. 91 బంతుల్లో 233 రన్స్




టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ తనపై వస్తున్న విమర్శలకు బ్యాట్‌తో గట్టి సమాధానం ఇచ్చాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో గత కొంతకాలంగా పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్న అతను, దేశవాళీ వన్డే మ్యాచ్‌లో విధ్వంసకర డబుల్ సెంచరీతో చెలరేగాడు. పంజాబ్ ఇంటర్-డిస్ట్రిక్ట్ సీనియర్ టోర్నమెంట్‌లో అమృత్‌సర్ తరఫున ఆడిన అభిషేక్, కేవలం 91 బంతుల్లోనే 233 పరుగుల భారీ స్కోరు సాధించాడు. ఈ మెరుపు ఇన్నింగ్స్‌లో ఏకంగా 25 సిక్సర్లు, 15 ఫోర్లు ఉండటం విశేషం. అభిషేక్ ధాటికి బౌలర్లు బెంబేలెత్తిపోయారు. మ్యాచ్ లో అతడికి బౌలింగ్ చేయాలంటేనే హడలిపోయే పరిస్థితి ఏర్పడింది.టార్న్ టరన్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో అభిషేక్ ఆరంభం నుంచే బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 256.04 స్ట్రైక్ రేట్‌తో పరుగుల వరద పారించాడు. అతని అద్భుత బ్యాటింగ్ కారణంగా అమృత్‌సర్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 533 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. అభిషేక్ అసాధారణ ఇన్నింగ్స్‌కు సంబంధించిన స్కోర్‌కార్డు, బ్యాటింగ్ క్లిప్‌లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# డ్రైవర్ల నుంచి సినిమాటోగ్రాఫర్ల వరకు.. చైనాలో ఏఐ దెబ్బకు ఉద్యోగాలు గల్లంతు!

- చైనాలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)
- ట్యాక్సీ డ్రైవర్లు, వైట్ కాలర్ ఉద్యోగుల ఉపాధిపై తీవ్ర ప్రభావం
- ఇప్పటికే బలహీనంగా ఉన్న జాబ్ మార్కెట్‌పై మరింత ఒత్తిడి
- ఉద్యోగ నష్టాలను ఏఐ భర్తీ చేస్తుందన్న చైనా అధ్యక్షుడి వ్యాఖ్యలు
- ప్రభుత్వ చర్యలు ఆలస్యమవుతాయనే ఆందోళనలో లక్షలాది కార్మికులు



చైనాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విస్తరణ అత్యంత వేగంగా జరుగుతుండటం, ఇప్పటికే బలహీనంగా ఉన్న కార్మిక మార్కెట్‌లో తీవ్ర ఆందోళనలకు కారణమవుతోంది. ఏఐ ఆధారిత సాంకేతికత వల్ల లక్షలాది ఉద్యోగాలు ప్రమాదంలో పడుతున్నాయని, ఇది నిరుద్యోగ సంక్షోభానికి దారితీయవచ్చని గార్డియన్ పత్రికలో పాత్రికేయురాలు అమీ హాకిన్స్ తన కథనంలో హైలైట్ చేశారు. ఇటీవల జరుగుతున్న పరిణామాలు ఈ భయాలను మరింత బలపరుస్తున్నాయి. వుహాన్ నగరంలో డ్రైవర్‌లెస్ ట్యాక్సీలను ప్రవేశపెట్టడంతో చాలా మంది ట్యాక్సీ డ్రైవర్లు ఒక్కసారిగా తమ ఉపాధిని కోల్పోయారు. అయితే, ఆ తర్వాత కొన్ని డ్రైవర్‌లెస్ కార్లు ఆకస్మికంగా రోడ్లపై నిలిచిపోయి ట్రాఫిక్ జామ్‌లకు కారణమవడంతో, వాటిని పరిశీలన కోసం తాత్కాలికంగా ఉపసంహరించారు. దీంతో డ్రైవర్లు మళ్లీ విధుల్లో చేరారు. ఈ ఘటన ఏఐ వల్ల ఎదురయ్యే ముప్పును కళ్లకు కట్టినట్టు చూపించింది. ఇది కేవలం డ్రైవర్లకే పరిమితం కాలేదు. ఏఐని ప్రవేశపెట్టడం కోసం వైట్ కాలర్ ఉద్యోగులను తొలగించిన సంస్థలు, కోర్టు తీర్పుల ప్రకారం వారికి నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చింది.
చైనాలో ఇప్పటికే నిరుద్యోగం అధిక స్థాయిలో ఉండగా, రియల్ ఎస్టేట్, విద్య వంటి రంగాలు మాంద్యంలోకి జారుకోవడంతో కోట్లాది మంది ఫార్మల్ ఉద్యోగాలను వదిలి గిగ్ ఎకానమీ (తాత్కాలిక పనులు) వైపు మళ్లుతున్నారు. ఒక థింక్‌ట్యాంక్ అంచనా ప్రకారం, 2019లో 160 మిలియన్లుగా ఉన్న గిగ్ వర్కర్ల సంఖ్య, ఈ ఏడాదికి 320 మిలియన్లకు (సుమారు 44 శాతం కార్మిక శక్తి) పెరుగుతుందని అంచనా. ఇలాంటి పరిస్థితుల్లో రైడ్-హెయిలింగ్ యాప్‌లపై ఆధారపడిన వారి ఉపాధికి ఇప్పుడు రోబోట్యాక్సీల రూపంలో గండి పడుతోంది. ఈ సమస్య సృజనాత్మక రంగాలనూ వదలడం లేదు. బీజింగ్‌లో 20 ఏళ్లుగా సినిమా పరిశ్రమలో పనిచేస్తున్న సినిమాటోగ్రాఫర్ టియాన్ జెమిన్, తన ఉద్యోగాన్ని ఏఐ సాఫ్ట్‌వేర్ వల్ల కోల్పోయారు. "ఆరేళ్ల కఠోర శ్రమ తర్వాత సినిమాటోగ్రాఫర్‌గా ఎదిగితే, ఇప్పుడు ఒక సాఫ్ట్‌వేర్ నా స్థానాన్ని భర్తీ చేసింది" అని ఆయన సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు. గత జులైలో జరిగిన ప్రపంచ ఏఐ సదస్సులో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మాట్లాడుతూ... ఏఐ అనేది అందరి శ్రేయస్సు, భద్రతకు చోదకశక్తిగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రైవేట్ రంగంపై ప్రభుత్వానికి గట్టి పట్టున్న చైనా, ఏఐ వల్ల కలిగే ఉద్యోగ నష్టాలను నివారించడానికి కంపెనీలకు నియామక కోటాలు విధించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ప్రభుత్వం తీసుకునే ఈ రక్షణ చర్యలు క్షేత్రస్థాయిలో ఇప్పటికే ఉద్యోగాలు కోల్పోతున్న వారిని కాపాడటానికి సమయానికి అందకపోవచ్చనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

# కెప్టెన్‌గా తిలక్ వర్మ.. దులీప్ ట్రోఫీకి సౌత్ జోన్ జట్టు ఇదే!




- దులీప్ ట్రోఫీకి సౌత్ జోన్ కెప్టెన్‌గా తిలక్ వర్మ ఎంపిక
- ఆంధ్ర ఆటగాడు రికీ భుయ్‌కు వైస్ కెప్టెన్సీ బాధ్యతలు
- గత రంజీ సీజన్ టాప్ స్కోరర్ స్మరణ్, కరుణ్ నాయర్‌కు జట్టులో చోటు
- గతేడాది ఫైనలిస్ట్ కావడంతో నేరుగా సెమీఫైనల్‌కు అర్హత
- ఈ నెల 23 నుంచి బెంగళూరు వేదికగా ఈ టోర్నమెంట్ ప్రారంభం


దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ దులీప్ ట్రోఫీ కోసం సౌత్ జోన్ తమ జట్టును ప్రకటించింది. భారత టీ20 జట్టు వైస్ కెప్టెన్, హైదరాబాద్ యువ సంచలనం తిలక్ వర్మకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. ఆంధ్ర జట్టుకు చెందిన సీనియర్ బ్యాటర్ రికీ భుయ్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. ఆగస్టు 23 నుంచి సెప్టెంబర్ 10 వరకు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (CoE) వేదికగా ఈ టోర్నమెంట్ జరగనుంది.
నేడు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి సానా సతీశ్ బాబు నేతృత్వంలో సెలక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఆంధ్ర మాజీ రంజీ ఆటగాడు ఆర్వీ చంద్రమౌళి ప్రసాద్ ఈ సెలక్షన్ ప్యానెల్‌కు ఛైర్మన్‌గా వ్యవహరించారు. ఈ సమావేశంలో సౌత్ జోన్‌లోని ఏడు సభ్య సంఘాలైన ఆంధ్రా, తమిళనాడు, కర్ణాటక, హైదరాబాద్, గోవా, పాండిచ్చేరి, కేరళ ప్రతినిధులు పాల్గొన్నారు. జట్టుకు హెడ్ కోచ్‌గా ఆంధ్రకు చెందిన అనుభవజ్ఞుడైన లెవల్ 2 కోచ్ ఎంఎన్ విక్రమ్ వర్మను నియమించారు. 15 మంది సభ్యులతో కూడిన ఈ జట్టులో యువత, అనుభవం చక్కగా మేళవించారు. భారత జట్టుకు ఆడిన వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్‌కు చోటు దక్కింది. 2025/26 రంజీ ట్రోఫీ సీజన్‌లో 950 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన కర్ణాటక యువ ఆటగాడు ఆర్. స్మరణ్, హైదరాబాద్‌కు చెందిన కె. హిమతేజ వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లను ఎంపిక చేశారు. ఇటీవలే జింబాబ్వేపై 3-0తో టీ20 సిరీస్ గెలిచిన భారత జట్టులో తిలక్ వర్మ సభ్యుడిగా ఉన్నాడు. శ్రీలంక 'ఎ'తో సిరీస్ గెలిచిన భారత 'ఎ' జట్టులో సభ్యులుగా ఉన్న షేక్ రషీద్ (ఆంధ్ర), ఎన్. జగదీశన్ (తమిళనాడు) కూడా ఈ జట్టులో ఉన్నారు. వికెట్ కీపింగ్ బాధ్యతలను జగదీశన్ నిర్వర్తించనున్నాడు. గోవా బ్యాటర్ అభినవ్ తేజ్రానా కూడా జట్టులో స్థానం సంపాదించాడు.గత ఎడిషన్‌లో సౌత్ జోన్ ఫైనల్‌కు చేరి సెంట్రల్ జోన్ చేతిలో ఓడిపోయిన సంగతి తెలిసిందే. ఈ కారణంగా ఈసారి నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. ఆగస్టు 30న బీసీసీఐ సీఓఈ గ్రౌండ్ 2లో జరిగే సెమీఫైనల్ మ్యాచ్ లో క్వార్టర్‌ఫైనల్ 2 విజేతతో సౌత్ జోన్ తలపడు తుంది. బౌలింగ్ విభాగం కూడా పటిష్ఠంగా ఉంది. స్పిన్ బాధ్యతలను లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్, లెగ్ స్పిన్నర్ శ్రేయాస్ గోపాల్ పంచుకోనున్నారు. పేస్ విభాగంలో కె. సాయితేజ, త్రిపురాన విజయ్, విద్వత్ కావరప్ప, ఎం.డి. నిదీశ్ ఉన్నారు.

**సౌత్ జోన్ జట్టు:**

ఎన్. తిలక్ వర్మ (కెప్టెన్), రికీ భుయ్ (వైస్ కెప్టెన్), అభినవ్ తేజ్రానా, షేక్ రషీద్, కె.ఎం. హిమతేజ, ఆర్. స్మరణ్, ఎన్. జగదీశన్ (వికెట్ కీపర్), కరుణ్ నాయర్, తనయ్ త్యాగరాజన్, శ్రేయస్ గోపాల్, కె. సాయితేజ, టి. విజయ్, విద్వత్ కావరప్ప, హెచ్. అమన్ ఖాన్, ఎం.డి. నిదీశ్.

# మార్కెట్ల జోరు.. వారం రోజుల్లో లక్షల కోట్లు ఆర్జించిన దిగ్గజాలు

- గత వారం స్టాక్ మార్కెట్ల ర్యాలీతో భారీగా లాభపడిన దేశీయ కంపెనీలు
- టాప్-10లో 9 కంపెనీల మార్కెట్ విలువ రూ.2.51 లక్షల కోట్లు పెరిగిన వైనం
- బజాజ్ ఫైనాన్స్ అత్యధికంగా లాభపడగా..
- హిందుస్థాన్ యూనిలీవర్‌కు నష్టాలు
- దేశంలో అత్యంత విలువైన కంపెనీగా రిలయన్స్ ఇండస్ట్రీస్ స్థానం పదిల



దేశీయ స్టాక్ మార్కెట్లలో గత వారం బలమైన ర్యాలీ కొనసాగడంతో దేశంలోని టాప్-10 అత్యంత విలువైన కంపెనీలలో తొమ్మిది కంపెనీల సంపద భారీగా పెరిగింది. ఈ కంపెనీలన్నీ కలిసి ఒక్క వారంలోనే తమ మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో (మార్కెట్ విలువ) ఏకంగా రూ.2.51 లక్షల కోట్లను జోడించుకున్నాయి. మార్కెట్ సూచీలైన సెన్సెక్స్ 2,034 పాయింట్లు (2.67%), నిఫ్టీ 616 పాయింట్లు (2.59%) లాభపడటం ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది.ఈ వారంలో లాభపడిన దిగ్గజ కంపెనీల జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ & టూబ్రో, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) ఉన్నాయి. అయితే, హిందుస్థాన్ యూనిలీవర్ (హెచ్‌యూఎల్) మాత్రం ఈ జాబితాలో నష్టాలను చవిచూసిన ఏకైక కంపెనీగా నిలిచింది.

**బజాజ్ ఫైనాన్స్‌కు అత్యధిక లాభాలు**

అత్యధికంగా లాభపడిన కంపెనీగా బజాజ్ ఫైనాన్స్ రికార్డు సృష్టించింది. ఈ కంపెనీ మార్కెట్ విలువ ఒక్క వారంలోనే రూ.80,345.97 కోట్లు పెరిగి రూ.7,10,817.51 కోట్లకు చేరింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 28% పెరగడమే ఈ ర్యాలీకి కారణం. ఈ వార్తతో శుక్రవారం ఒక్కరోజే కంపెనీ షేరు 8% పైగా పెరిగింది.ఇతర కంపెనీల విషయానికొస్తే.. భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ.44,959.5 కోట్లు పెరిగి రూ.12,30,005.63 కోట్లకు చేరింది. టీసీఎస్ రూ.40,414.03 కోట్లు, రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.39,447.35 కోట్లు చొప్పున లాభపడ్డాయి. లార్సెన్ & టూబ్రో రూ.21,096.8 కోట్లు, ఎస్‌బీఐ రూ.10,845.97 కోట్లు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.8,164.73 కోట్లు, ఎల్ఐసీ రూ.4,427.49 కోట్లు, ఐసీఐసీఐ బ్యాంక్ రూ.1,660.37 కోట్ల మేర తమ మార్కెట్ విలువను పెంచుకున్నాయి. మరోవైపు, హిందుస్థాన్ యూనిలీవర్ మార్కెట్ విలువ రూ.10,326.46 కోట్లు తగ్గి రూ.4,93,602.13 కోట్లకు పడిపోయింది.వారం ముగిసే నాటికి రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలోనే అత్యంత విలువైన కంపెనీగా తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ ఉన్నాయి.

# టీమిండియాకు ఎదురుదెబ్బ.. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు బుమ్రా కష్టమే!




- మోకాలి గాయంతో శ్రీలంక టెస్టు సిరీస్‌కు బుమ్రా దూరం
- ఇంగ్లండ్ పర్యటనలో అయిన గాయం నుంచి ఇంకా కోలుకోని బుమ్రా!
- వైద్యుల సూచనతో విశ్రాంతికి మొగ్గుచూపిన బీసీసీఐ
- బుమ్రా స్థానంలో ఆకిబ్ నబీని తీసుకునే అవకాశం
- ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్టు

భారత క్రికెట్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జట్టు ప్రధాన పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా, శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు దూరమయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎడమ మోకాలిలో అసౌకర్యంతో బాధపడుతున్న అతనికి పూర్తిస్థాయిలో కోలుకోవడానికి మరింత సమయం అవసరమని బీసీసీఐ వైద్య బృందం భావిస్తోంది. దీంతో ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న ఈ కీలక సిరీస్‌కు బుమ్రా సేవలు కోల్పోవడం దాదాపు ఖాయమైంది.
వివరాల్లోకి వెళ్తే, గత నెల ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో బుమ్రా గాయపడ్డాడు. జులై 19న కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో ఫీల్డింగ్ చేస్తుండగా అతని ఎడమ మోకాలికి దెబ్బ తగలడంతో వాపు వచ్చింది. అప్పటి నుంచి అతను బౌలింగ్‌కు దూరంగా ఉన్నాడు. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో ఉన్న బుమ్రా, ఇంకా బౌలింగ్ ప్రాక్టీస్ ప్రారంభించలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. "ఇప్పుడే అతడిని ఆడిస్తే గాయం తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉంది. అందుకే, బుమ్రా పూర్తిగా కోలుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ నేపథ్యంలో శ్రీలంక పర్యటనకు అతను దూరంగా ఉండొచ్చు" అని ఓ అధికారి ఐఏఎన్ఎస్‌కు తెలిపారు.వాస్తవానికి, శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టెస్టు జట్టుకు బుమ్రాను ఎంపిక చేసినప్పటికీ, ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే తుది జట్టులో ఉంటాడని సెలక్టర్లు స్పష్టం చేశారు. ఇప్పుడు అతను దూరం కానుండటంతో, అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ అతని స్థానంలో ప్రత్యామ్నాయ ఆటగాడిని ప్రకటించనుంది. జమ్మూ కశ్మీర్ సీమ్ బౌలింగ్ ఆల్ రౌండర్ ఆకిబ్ నబీ ఈ రేసులో ముందున్నాడు. ఇటీవల రంజీ ట్రోఫీలో 60 వికెట్లతో సత్తాచాటిన నబీ, ఇండియా-ఏ తరఫున శ్రీలంక పర్యటనలోనూ రాణించాడు. బుమ్రా గైర్హాజరీతో భారత పేస్ బౌలింగ్ విభాగంలో మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్ మాత్రమే మిగిలారు. భారత జట్టు ఆగస్టు 4న శ్రీలంకకు బయలుదేరి వెళ్లనుంది. అక్కడ ఆగస్టు 7 నుంచి 9 వరకు కొలంబోలో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతుంది. అనంతరం గాలే వేదికగా ఆగస్టు 15న తొలి టెస్టు, కొలంబోలో ఆగస్టు 23 నుంచి రెండో టెస్టు జరుగుతాయి.

## మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల తనిఖీ

కనిగిరి, (సింధూర దర్శిని) 2 ఆగస్టు : పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజనం నాణ్యతపై విద్యార్థినులతో ఆప్యాయంగా మాట్లాడారు. అలాగే పాఠశాలలోని మౌలిక వసతులు, హాస్టల్ సౌకర్యాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యా ప్రమాణాల గురించి విద్యార్థినులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులు అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# సినిమా న్యూస్




## దేవి శ్రీ హీరోగా 'ఎల్లమ్మ'.. కిర్రాక్ పుట్టించే ఫస్ట్ లుక్ వచ్చేసింది!

**హీరోగా సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్..**
**'ఎల్లమ్మ' ఫస్ట్ లుక్ విడుదల**
**'పర్షి' అనే పల్లెటూరి యువకుడి పాత్రలో కనిపించనున్న దేవి శ్రీ ప్రసాద్**
**'బలగం' తర్వాత వేణు యెల్దండి దర్శకత్వంలో ఈ చిత్రం**
**శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మాణం**
**పాన్ ఇండియా స్థాయిలో పలు భాషల్లో సినిమా విడుదల**

ప్రముఖ సంగీత దర్శకుడు, రాక్?స్టార్ దేవి శ్రీ ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్ అందింది. ఆయన కథానాయకుడిగా వెండితెరకు పరిచయం అవుతున్న 'ఎల్లమ్మ' చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో దేవి శ్రీ ప్రసాద్ 'పర్షి' అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ లుక్ విడుదలైన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.విడుదలైన పోస్టర్‌లో దేవి శ్రీ ప్రసాద్ రెట్రో రగ్డ్ లుక్‌లో, పల్లెటూరి యువకుడిగా ఎంతో సహజంగా కనిపిస్తున్నారు. ఆయన పాత్ర పేరు 'పర్షి' అని ప్రకటిస్తూ, "మీరు గుర్తుంచుకునే పేరు, మీరు ఎప్పటికీ మరచిపోలేని ప్రయాణం" అనే క్యాప్షన్‌ను జోడించారు. దీన్నిబట్టి ఈ సినిమా మట్టితో ముడిపడిన ఒక బలమైన కథతో రాబోతోందని అర్థమవుతోంది. 'బలగం' వంటి జాతీయ అవార్డు పొందిన చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన వేణు యెల్దండి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో అంచనాలు తారాస్థాయికి చేరాయి.టాలీవుడ్‌లో అగ్ర నిర్మాణ సంస్థగా పేరుగాంచిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు డీఎస్పీ కేవలం హీరో మాత్రమే కాదు, సంగీత దర్శకుడిగానూ బాధ్యతలు నిర్వర్తిస్తుండటం విశేషం. ఒకవైపు నటన, మరోవైపు తనదైన సంగీతంతో ఆయన ఎలా మ్యాజిక్ చేస్తారోనని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఇది పక్కా విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే యాక్షన్ డ్రామా అని తెలుస్తోంది. 'ఎల్లమ్మ'పై పరిశ్రమలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. హీరోయిన్ ఎవరనేది ఇంకా అధికారికంగా ప్రకటించనప్పటికీ, వేణు యెల్దండి సినిమాల్లోని పాత్రలకు ఉండే ప్రాధాన్యత దృష్ట్యా కథానాయిక పాత్ర కూడా బలంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

## ప్రాంతీయ ముద్రలు తగవు.. 'ఇడుపుకాయితం' వివాదంపై నరేశ్

**తెలంగాణ అంటే తాగడం, ఆంధ్రా అంటే తిండి అనడం తప్పన్న నరేశ్**
**ప్రతి ప్రాంతానికి దాని సంస్కృతి, గొప్పతనం ఉంటాయని వెల్లడి**
**'ఇడుపుకాయితం' టైటిల్ వివాదం తనను బాధించిందన్న నటుడు**
**మాండలికాలు వేరైనా మాట్లాడేది తెలుగు భాషేనని స్పష్టీకరణ**
**సోషల్ మీడియాలోని పోస్టులను పట్టించుకోవద్దని సూచన**

'ఇడుపుకాయితం' సినిమా శీర్షికపై ఇటీవల తలెత్తిన వివాదం నేపథ్యంలో, ప్రాంతీయత ఆధారంగా ముద్రలు వేయడాన్ని ప్రముఖ నటుడు నరేశ్ తప్పుపట్టారు. తెలంగాణ అంటే కేవలం మద్యం, ఆంధ్ర అంటే కేవలం ఆహారం అన్నట్లుగా చిత్రీకరించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ప్రతి ప్రాంతానికి ప్రత్యేకమైన ఆచారాలు, సంస్కృతి ఉంటాయని, ఏ ప్రాంత సంప్రదాయం ఆ ప్రాంతానికి గొప్పదని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. "మాండలికాలు వేర్వేరుగా ఉండవచ్చు కానీ, మనమంతా మాట్లాడేది తెలుగు భాషే. మనం నిర్మించేవి తెలుగు సినిమాలే" అని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే అసంబద్ధ పోస్టులను, విమర్శలను పట్టించుకోవద్దని ప్రజలకు సూచించారు. గతంలో తెలంగాణలో తనకు ఎదురైన ఒక అనుభవాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఒక




అంత్యక్రియల కార్యక్రమంలో కొందరు మద్యం తాగడం చూసి తొలుత తాను ఆశ్చర్యపోయానని, అయితే మృతుడితో ఉన్న అనుబంధాన్ని (అతడు శత్రువైనా, మిత్రుడైనా) మనసు విప్పి మాట్లాడటం తనను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. 'ఇడుపుకాయితం' అనే పేరు అర్థం కావడం లేదని, సబ్‌టైటిల్స్ కావాలంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో ఎగతాళి చేయడం, దీనిపై తెలంగాణ కవులు, కళాకారులు తీవ్రంగా స్పందించడం వంటి పరిణామాలు తనను ఎంతగానో బాధించాయని నరేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.



## త్వరలో పెళ్లి పీటలెక్కనున్న పూజా హెగ్డే?.. పెద్దలు కుదిర్చిన సంబంధమంటూ ప్రచారం!

**త్వరలో పెళ్లి పీటలెక్కనుందంటూ పూజా హెగ్డేపై జోరుగా ప్రచారం**
**ఇది ప్రేమ వివాహం కాదని, పెద్దలు కుదిర్చిన సంబంధమని టాక్**
**వరుడి వివరాలపై కొనసాగుతున్న సస్పెన్స్**
**పెళ్లి వార్తలపై ఇంకా స్పందించని పూజా హెగ్డే, ఆమె కుటుంబం**
**ప్రస్తుతం మళ్లీ కొత్త ప్రాజెక్ట్‌లతో బిజీ అవుతున్న స్టార్ హీరోయిన్**

టాలీవుడ్ స్టార్ హీరోయిన్, బుట్టబొమ్మ పూజా హెగ్డే మరోసారి వార్తల్లో నిలిచారు. అయితే ఈసారి కొత్త సినిమా లేదా గ్లామరస్ ఫోటోషూట్ వల్ల కాదు, తన పెళ్లి వార్తలతో ఆమె సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. త్వరలోనే పూజా హెగ్డే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారంటూ సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఆమె కెరీర్ పరంగా కాస్త నెమ్మదించిన ఈ తరుణంలో ఈ వార్తలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.తాజా సమాచారం ప్రకారం, ఇది ప్రేమ వివాహం కాదని, కుటుంబ సభ్యులు చూసిన సంబంధానికే పూజా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. అయితే ఆమె చేసుకోబోయే వరుడు సినీ పరిశ్రమకు చెందిన వారా లేక వ్యాపారవేత్తా అనే దానిపై ఎలాంటి స్పష్టత లేదు. ఈ వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నప్పటికీ, పూజా హెగ్డే గానీ, ఆమె ప్రతినిధులు గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. దీంతో ఈ ప్రచారంలో నిజమెంత ఉందనేది తేలాల్సి ఉంది. అభిమానులు మాత్రం అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు.ఒకప్పుడు టాలీవుడ్‌ను ఏలిన పూజా హెగ్డే కెరీర్‌ను పరిశీలిస్తే, 2014లో 'ఒక లైలా కోసం' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత 'ముకుంద'లో నటించినా, ఆమెకు అసలైన బ్రేక్ ఇచ్చింది మాత్రం అల్లు అర్జున్‌తో చేసిన 'డీజే: దువ్వాడ జగన్నాథం'. ఈ సినిమా తర్వాత ఆమె వెనుదిరిగి చూసుకోలేదు. ఎన్టీఆర్‌తో 'అరవింద సమేత వీర రాఘవ', మహేష్ బాబుతో 'మహర్షి', అల్లు అర్జున్‌తో 'అలా వైకుంఠపురములో' వంటి బ్లాక్‌బస్టర్ హిట్‌లతో అగ్ర కథానాయికగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు.అగ్రస్థానంలో దూసుకెళ్తున్న సమయంలో ఆమెకు వరుస పరాజయాలు ఎదురయ్యాయి. ప్రభాస్‌తో చేసిన పాన్ ఇండియా చిత్రం 'రాధే శ్యామ్' భారీ అంచనాలతో విడుదలై నిరాశపరిచింది. ఆ తర్వాత 'ఆచార్య', తమిళంలో 'బీస్ట్', హిందీలో నటించిన చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయాయి. దీంతో ఆమె కెరీర్ కొంత నెమ్మదించింది. అయితే, ప్రస్తుతం పూజా హెగ్డే కొత్త ప్రాజెక్ట్‌లతో మళ్లీ బిజీ అవుతున్నారు. మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్‌తో కలిసి 'శ్రీశ్రీ' చిత్రంలో, రాఘవ లారెన్స్ హీరోగా తెరకెక్కుతున్న 'కాంచన 4'లోనూ ఆమె కథానాయికగా ఎంపికయ్యారు. వీటితో పాటు అల్లు అర్జున్ సరసన మరోసారి నటించే అవకాశం ఉన్నట్లు కూడా ఫిల్మ్ నగర్‌లో టాక్ వినిపిస్తోంది.



## జీరో సైజ్ ఉంటేనే హీరోయిన్లా?.. నటి అంజలి ఆనంద్

**గ్లామర్ అంటే జీరో సైజ్ మాత్రమేనా అని ప్రశ్నించిన అంజలి ఆనంద్**
**తన నటన కంటే బరువుపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నారని ఆవేదన**
**నటీమణుల ప్రతిభను గుర్తించి పాత్రలు రాయాలని దర్శక, రచయితలకు సూచన**
**ధమాల్ 4 ట్రైలర్ తర్వాత వచ్చే ట్రోలింగ్‌కు సిద్ధంగా ఉన్నానని వెల్లడి**
**బాడీ షేమింగ్ ఒక సామాజిక రుగ్మత అని వ్యాఖ్య**

"రాకీ ఔర్ రాణి కీ ప్రేమ్ కహానీ" చిత్రంతో గుర్తింపు పొందిన నటి అంజలి ఆనంద్.. బాలీవుడ్‌లో నటీమణులు ఎదుర్కొంటున్న బాడీ షేమింగ్, ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై గళమెత్తారు. ప్రస్తుతం ధమాల్ 4 సినిమాలో నటించిన ఆమె చిత్ర పరిశ్రమలో అందానికి ఉన్న సంకుచిత నిర్వచనాలను సూటిగా నిలదీశారు."బాలీవుడ్‌లో గ్లామర్ అంటే కేవలం 'జీరో సైజ్' శరీరాకృతి మాత్రమేనా? ఒక నటి ప్రతిభను కాకుండా, ఆమె రూపాన్ని బట్టి భవిష్యత్తును ఎందుకు అంచనా వేస్తున్నారు?" అని అంజలి ప్రశ్నించారు. తన నటన, కష్టం కంటే తన బరువు గురించే సమాజం ఎక్కువగా చర్చించడం బాధాకరమని, అయితే అటువంటి విమర్శలకు కుంగిపోకుండా తన ప్రతిభతోనే సమాధానం చెబుతానని ఆమె స్పష్టం చేశారు. తన పోరాటం కేవలం తన కోసమే కాదని, ఇటువంటి వివక్షను ఎదుర్కొంటున్న ప్రతి అమ్మాయి కోసమని ఆమె పేర్కొన్నారు.సంప్రదాయ కథానాయికల రూపానికి భిన్నంగా ఉండే నటీమణులకు బాలీవుడ్‌లో ఇప్పటికీ ఆశించిన స్థాయిలో పాత్రలు లభించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నటీమణుల బాహ్య రూపాన్ని కాకుండా, వారి నైపుణ్యాలను, భావోద్వేగాలను వాడుకునేలా రచయితలు, దర్శకులు పాత్రలను సృష్టించాలని ఆమె కోరారు. 'ధమాల్ 4'లో తన పాత్ర, తాను వ్యక్తిగతంగా వ్యతిరేకించే అంశానికి సంబంధించి ఉండటంతో, దానిని అంగీకరించే ముందు కొంత మానసిక సంఘర్షణకు లోనైనట్లు ఆమె వెల్లడించారు.

'ధమాల్ 4' ట్రైలర్ విడుదలైన తర్వాత ఎదురైన ట్రోలింగ్‌ను తాము ముందే ఊహించామని, దానికి మానసికంగా సిద్ధమయ్యామని అంజలి తెలిపారు. ట్రోల్స్‌ను పట్టించుకోకపోవడమే సరైన సమాధానమని, విమర్శలను ఎదుర్కోవడానికి తనకు ఎవరి ఓదార్పు అవసరం లేదని ఆమె ధీమా వ్యక్తం చేశారు. బరువు, రంగు, దుస్తుల ఆధారంగా మనుషులను అంచనా వేయడం అనేది సమాజంలో వేళ్లూనుకున్న ఒక రుగ్మత అని, ఒక కళాకారిణిగా తన వృత్తి ద్వారా ఈ ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటానని ఆమె స్పష్టం చేశారు.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662